నేడు నారావారిపల్లికి ముఖ్యమంత్రి

తమ్ముడి సంవత్సరిక కార్యానికి హాజరు
ఏర్పాట్ల పరిశీలనలో కలెక్టర్, ఎస్పీ

చంద్రగిరి, అక్టోబర్ 6 ప్రభాతవార్త:
ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మంగళవారం తన సొంతూరు నారావారిపల్లికి రానున్నారు. దివంగత మాజీ ఎంఎల్ఏ, సిఎం సోదరుడు నారా రామ్మూర్తి నాయుడు సంవత్సరిక కార్యాన్ని కుటుంబ సభ్యులు మంగళవారం నిర్వహించతలపెట్టారు. ఈ నేపథ్యంలో జిల్లా కలెక్టర్ ఎస్.డాక్టర్ వెంకటేశ్వర్, ఎస్పీ ఎల్.సుబ్బరాయుడు, శాప్ చైర్మన్ ఎ.రవి నాయుడు సోమవారం నారావారిపల్లికి చేరుకుని ఏర్పాట్లను పరిశీలించారు. ఏ.రంగంపేట, జడ్పీ హైస్కూల్ వద్ద ఏర్పాటు చేసిన హెలిప్యాడ్‌ను పరిశీలించారు. అదేవిధంగా నారా రామ్మూర్తి నాయుడు ఘాట్ వద్ద పనులను పరిశీలించి అధికారులకు సూచనలు చేశారు. వాహనాల పార్కింగ్ కొరకు సిద్ధం చేసిన స్థలాన్ని పరిశీలించారు. అదేవిధంగా మధ్యాహ్నం అతిథులకు భోజన ఏర్పాట్లలో లోపాలు తలెత్తకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకున్నారు. పరిసరాల పరిశుభ్రతకు పంచాయతీ యంత్రాన్ని అప్రమత్తం చేశారు. ముఖ్యమంత్రి కాన్వాయ్ నిర్వహించిన ట్రైల్‌రన్‌ను పరిశీలించారు.

నారావారిపల్లి చేరుకున్న నారా భువనేశ్వరి, లోకేష్

ఐటి మంత్రి నారా లోకేష్ సోమవారం రాత్రి నారావారిపల్లికి చేరుకున్నారు. తన పిన తండ్రి దివంగత మాజీ ఎంఎల్ఏ నారా రామ్మూర్తి నాయుడు సంవత్సరిక కార్యానికి ఆయన ఇక్కడికి చేరుకున్నారు. అదేవిధంగా ముఖ్యమంత్రి సతీమణి నారా భువనేశ్వరి రాత్రి 7 గంటలకు ఇక్కడికి చేరుకున్నారు. ఇద్దరూ వేర్వేరుగా నారావారిపల్లికి విచ్చేశారు. మంగళవారం జరుగనున్న కార్యానికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సైతం హాజరుకానున్నారు. ఆ మేరకు అవసరమైన ఏర్పాట్లను ఇప్పటికే పూర్తి చేశారు.

తిరుపతి - చిత్తూరు
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త

పక్కాగా సమస్యలకు పరిష్కారం

- ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో కలెక్టర్ సుమిత్‌కుమార్

చిత్తూరు, అక్టోబర్ 6 ప్రభాతవార్త:
ప్రజల నుండి సమస్యలపై అందిన ప్రతి అర్జీని నిర్దేశించిన గడువులోపు పక్కాగా పరిష్కరించాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని నూతన సమావేశభవనంలో కలెక్టర్ సుమిత కుమార్ ఆధ్వర్యంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం జరిగింది. జిల్లా నలుమూలల వున్న ప్రజల నుండి సమస్యలపై 274 అర్జీలు అందాయి. ఈ కార్యక్రమానికి కలెక్టర్ సుమిత్‌కుమార్ హాజరై ప్రజల నుండి సమస్యలపై అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా ప్రతి అర్జీని అధికారులు క్షుణ్ణంగా పరిశీలించి నిర్దేశించిన గడువులోపు పక్కాగా పరిష్క రించాలన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ నరేంద్రపాడేల్, జిల్లా రెవెన్యూ అధికారి మోహన్‌కుమార్, డిప్యూటీ కలెక్టర్ కుసుమకుమారి, చిత్తూరు ఆర్డీఓ శ్రీనివాసులులు హాజరయ్యారు.

జిల్లా స్థాయి స్వచ్ఛతా అవార్డులను అందిస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్, ఎమ్మెల్యేలు గురజాల జగన్మోహన్‌నాయుడు, డాక్టర్ కలికిరి మురళీమోహన్‌లు.

స్వచ్ఛతలో ప్రతి ఒక్కరు భాగస్వామ్యం

- స్వచ్ఛతా జిల్లా స్థాయి అవార్డుల పంపిణీ కార్యక్రమంలో కలెక్టర్

చిత్తూరు, అక్టోబర్ 6 ప్రభాతవార్త:
స్వచ్ఛతా కార్యక్రమంలో ప్రతి ఒక్కరు భాగస్వామ్యం కావాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ పిలుపునిచ్చారు. చిత్తూరు నాగయ్య కళాక్షేత్రంలో సోమవారం కలెక్టర్ సుమిత్‌కుమార్ అధ్యక్షతన స్వచ్ఛ ఆంధ్రా అవార్డులు-2025 జిల్లా స్థాయి కార్యక్రమం జరిగింది. ముఖ్య అతిథులుగా చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్‌నాయుడు, పూతలపట్టు ఎమ్మెల్యే డాక్టర్ కలికిరి మురళీమోహన్, విశిష్ట అతిథిగా గన్నవరం ఎమ్మెల్యే ఎర్లగడ్డ వెంకట్రావ్, మేయర్ అముద, చుడా చైర్‌పర్సన్ కఠారి హేమలత, జిల్లా కేంద్ర సహకార బ్యాంకు చైర్మన్ అమాజ రాజశేఖర్‌రెడ్డి తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ సుమిత్‌కుమార్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరు స్వచ్ఛత, శానిటేషన్‌పై ఆలోచన చేయాలని, స్వచ్ఛతా కార్యక్రమంలో భాగంగా స్వచ్ఛత కార్పొరేషన్ చిత్తూరు జిల్లాకు రాష్ట్ర స్థాయిలో 7 అవార్డులు, జిల్లా స్థాయిలో 55 అవార్డులను ప్రకటించిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం గాంధీజయంతి సందర్భంగా అక్టోబర్ 2వ తేదీ వివిధ విభాగాలకు రాష్ట్ర, జిల్లా స్థాయిలో స్వచ్ఛంధ్ర అవార్డు లు-2025 ప్రకటించిందన్నారు. ప్రతి నియోజకవర్గం, ప్రతి మండలం, ప్రతి గ్రామంలో మనమందరం కలసికట్టుగా పని చేసి జిల్లాను అగ్రస్థానంలో నిలపడానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్‌నాయుడు మాట్లాడుతూ 2026 సంవత్సరంలో జిల్లాకు వంద అవార్డులు రావాలని, దీనికోసం అందరం సమిష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. గన్నవరం ఎమ్మెల్యే ఎర్లగడ్డ వెంకట్రావ్ మాట్లాడుతూ రాజధాని అమరావతిని 4 సంవత్సరాల్లో 59 వేల కోట్ల రూపాయలు ఖర్చు చేసి పూర్తి చేస్తామని, పోలవరం ప్రాజెక్టు పూర్తి చేయడానికి సిఎం నారా చంద్రబాబునాయుడు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారన్నారు. పూతలపట్టు ఎమ్మెల్యే డాక్టర్ కలికిరి మురళీమోహన్ మాట్లాడుతూ సిఎం చంద్రబాబునాయుడు ముందు చూపు వున్న వ్యక్తి అన్నారు. ప్రాథమిక సూత్రాలు అమలు పరచిన వ్యక్తులు గొప్ప వ్యక్తులుగా వుంటా రన్నారు. జడ్పీ సిఇఓ రవికుమార్‌నాయుడు, మున్సిపల్ కమీషనర్ నరసింహప్రసాద్, జిల్లా బిజెపి అధ్యక్షులు జగదీష్‌నాయుడు, మున్సిపల్ కార్పొరేటర్లు, అవార్డు గ్రహీతలు పాల్గొన్నారు.

తిరుమల మహిళలకు నో జీరో ఫేర్!

-"స్త్రీ శక్తి" కి నోచుకోలేకపోతున్న కొండవాసులు

ప్రభాతవార్తప్రతినిధి-తిరుమల:
తిరుమలకొండపై నివాసముంటున్న స్థానిక మహిళలు స్త్రీశక్తి పథకానికి అర్హులు కాలేకపోతున్నారు. ఈ హామీని కొండపై ఉంటున్న మహిళలు వినియోగించుకోలేకపోతుండటంతో అసహనం చెందుతున్నారు. ఇప్పటికీ తిరుమలలో ఉంటున్న స్థానిక మహిళలు తిరుపతికి దిగి తిరిగి కొండకు చేరుకోవడానికి ఆర్టీసి సప్తగిరి ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో, విద్యుత్‌బస్సుల్లో టిక్కెట్ తీసుకుని ప్రయాణిస్తున్నారు. తిరుమల ఘాట్‌రోడ్డు కారణంగా ఈ అవకాశం కోల్పోతున్నారు .తిరుమల మహిళలకు ఉచిత బస్సుప్రయాణం దూరమైంది. తిరుమలలో 2,500మంది వరకు స్థానికంగా మహిళలు నివాసముంటున్నారు. వీరిలో చాలావరకు ఏదేని గృహావసరాలు, పలు రకాల పనుల నిమిత్తం, తమ పిల్లలను పాఠశాలల్లో, కళాశాలల్లో చదివించడానికి టిక్కెట్ తీసుకుని ప్రయాణిస్తున్నారు. కూటమి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగాఆగస్ట్ 15వతేదీ నుండి "స్త్రీ శక్తి"పథకం మహిళలకు ఆర్టీసి బస్సుల్లో ఉచిత ప్రయాణం అమలవుతున్నా తిరుపతి-తిరుమల, తిరుమల -తిరుపతి మధ్య ఘాట్‌లో సప్తగిరి ఎక్స్‌ప్రెస్ బస్సులు, విద్యుత్‌ఏసి బస్సుల్లో వర్తించడం లేదు. దీంతో మహిళలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఎప్పటిలాగే టిక్కెట్ కొనుగోలుచేసి ఆర్టీసి బస్సుల్లో ప్రయాణించడం తప్పనిసరిగా మారింది. ప్రస్తుతం 18కిలోమీటర్లు దూరం వున్న తిరుమలఘాట్‌లో నడిచే ఆర్టీసి బస్సుల్లో బస్సు ఛార్జీ ఒక్కోప్రయాణీకునికి 90రూపాయలు (ఒకవైపు ప్రయాణం)వసూలుచేస్తున్నారు. తిరుగుప్రయాణంలోనూ (తిరుపతికి) 90రూపాయలు టిక్కెట్ తీసుకుని ప్రయాణించాల్సి వస్తోంది. వీరేగాక తిరుమలకు ప్రతిరోజూ వస్తున్న భక్తుల్లో మహిళలకు ఈ ఉచిత ఫేర్ అమలుకావడం లేదు. మహిళలు ఆధార్‌కార్డు, ఓటరుకార్డు,డ్రైవింగ్ లైసెన్స్ ఆధారంతో చూపి ఉచితంగా ఆర్టీసి నడుపుతున్న పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్, మెట్రో ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో ప్రయాణించే సదుపాయం అందూబాటులోఉంది.

సిఎంచే అవార్డు అందుకున్న కమిషనర్ శ్రీనివాసరావు

- రాష్ట్ర స్థాయిలో కుప్పానికి స్వచ్ఛాంధ్ర పురస్కారం !!

కుప్పం, అక్టోబర్ 6 ప్రభాతవార్త
రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా సోమవారం సాయంత్రం విజయవాడలో కుప్పం మున్సిపల్ కమీషనర్ ఉయ్యాల శ్రీనివాసరావు అవార్డు అందుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన స్వచ్ఛాంధ్ర 2025 అవార్డుల్లో రాష్ట్ర స్థాయిలో ఆరు మున్సిపాలిటీలు ఎంపిక కాగా అందులో కుప్పం పురపాలక సంఘం సైతం స్థానం దక్కించుకుంది. ఈ నేపథ్యంలో కమీషనర్ శ్రీనివాసరావు సిఎం చేతుల మీదుగా పురస్కారాన్ని కుప్పం మున్సిపాలిటీ తరపున అందుకున్నారు. కార్యక్రమంలో రాష్ట్ర మున్సిపల్ శాఖ మంత్రి పి. నారాయణ, స్వచ్ఛాంధ్ర కార్పోరేషన్ చైర్మన్ పట్టాభి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కమీషనర్ మాట్లాడుతూ రాష్ట్ర స్థాయిలో కుప్పానికి అవార్డు రావడం ఆనందంగా ఉందన్నారు. ఈ అవార్డు తన బాధ్యతను మరింత పెంచిందన్నారు. సిఎం చంద్రబాబునాయుడు ఆదేశాలతో కుప్పాన్ని క్లీన్ కుప్పం - గ్రీన్ కుప్పంగా మార్చేందుకు శక్తివంచన లేకుండా పని చేస్తానన్నారు.

రోడ్డు పక్కనే డంపు
ఊరంతా కంపు

శ్రీ సిటీ (తడ) అక్టోబర్ 6 ప్రభాతవార్త
కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర నినాదంతో గ్రామాలు పట్టణాలు పరిశుభ్రంగా ఉంచేందుకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నాయి గ్రామాలను పరిశుభ్రంగా ఉంచేందుకు అధికారులు చర్యలు చేపట్టినప్పటికీ ఆచరణలోకి కనబడటం లేదు అందుకు నిదర్శమే తడ పట్టణం శివాలయం సమీపంలో గల డంపింగ్ యార్డ్ తడ తడకండ్రిగ పంచాయతీలకు చెత్త ద్వారా సంపద సృష్టించే కేంద్రాలు అందుబాటులో లేకపోవడంతో రెండు గ్రామాల చెత్త రోడ్డు పక్కనే వేస్తున్నారు డంపింగ్ యార్డ్ తలపించేలా తయారైంది ఈ ప్రాంతం ఇదే అలుసుగా తీసుకొని హోటల్ వ్యర్థాలు చికెన్ వ్యర్థాలు వివిధ పరిశ్రమల నుండి వచ్చే వ్యర్థాలు గుట్టు చప్పుడు కాకుండా ఇక్కడికి చేరిపోతున్నాయి డంపింగ్ నుంచి వచ్చే దుర్వాసన పందుల పైరవిహారం ప్రయాణికులకు దేవాలయానికి వచ్చే భక్తులకు తీవ్ర ఇబ్బందికి గురిచేస్తుంది నెలలు తరబడి చెత్త పేరుకు పోతున్న అధికారులు పట్టించుకోకపోగా అక్రమంగా చెత్త తరలిస్తున్న వారిపై చర్యలు తీసుకున్నట్టు ఎక్కడా కనిపించడం లేదు డంపింగ్ యార్డ్ ప్రజా పరిషత్ కార్యాలయానికి కూత వేటు దూరంలో ఉంది అధికారులు ప్రతిరోజు కార్యాలయానికి అదే మార్గంలో ప్రయాణిస్తు న్నప్పటికీ అధికారులు చూసి చూడనట్టు వ్యవహరిస్తున్నారు. డంపింగ్ నుంచి వచ్చే దుర్వాసన కిలోమీటర్ మేర వ్యాప్తి చెందుతుంది అసలే వచ్చేది వర్షాకాలం దోమలు వ్యాప్తి చెంది వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని గ్రామస్తులు ఆవేదన చెందుతున్నారు

కాంట్రాక్టర్ స్వలాభంకోసం
చెరువు మరువ తవ్వేశారు

చెరువు మరువను తవ్వేసిన దృశ్యం

శాంతిపురం, అక్టోబర్ 6 ప్రభాతవార్త
మండలంలోని సోగడబళ్ల పెద్ద చెరువు మరువను ఓ కాంట్రాక్టర్ తన స్వలాభం కోసం తవ్వేసిన ఉదంతంపై అఖిల పక్ష నేతలు, ప్రజలు మండిపడుతున్నారు. వివరాలిలా.. కర్ణాటకలో కురుస్తున్న వర్షాలతో మండలంలోని సోగడబళ్ల పెద్ద చెరువుకు కొన్ని రోజులుగా నీరుచేరుతుండడంతో సగభాగం చెరువు నిండింది. అయితే ఓ కాంట్రాక్టర్ తాను చేపట్టే పనులకు అడ్డుగా ఉందని ఏకంగా చెరువు మరువను తవ్వేశాడు. దీంతో ప్రజలు ఆగ్రహించారు. చెరువు నిండి ఐదేళ్లు కావస్తోందని ఎగువ నుంచి నీరు వస్తుండడంతో బోర్లు, బావుల్లో నీటి మట్టం పెరుగుతోందని సంతోష పడేసమయంలో కాంట్రాక్టర్ ఇలా చేయడం దారుణమన్నారు. చెరువు పనులకు దాదాపు నలభై లక్షలు మంజూరు అయ్యాయన్నారు. మరువ తవ్వేసిన అంశంపై ఇరిగేషన్ అధికారులకు ఫిర్యాదు చేయడంతో ఎఇ లక్ష్మి కాంట్రాక్టర్ దగ్గరే మరువ పనులు చేయించారు. అయితే కాంట్రాక్టర్‌పై తగు చర్యలు తీసుకోవాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. సిఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్తామన్నారు. ఈ విషయంగా ఇరిగేషన్ ఎఇ లక్ష్మిని ప్రభాతవార్త వివరణకోరగా కాంట్రాక్టర్ చేసింది తప్పేనన్నారు. తమకు విషయం తెలియగానేస్పందించి మరువ పని చేయించామన్నారు. విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామన్నారు.

నింద్ర ఎంపీపీగా నాగినేని దుర్గాదేవి

ఎంపీపీ పదవి చేపడుతున్న నాగినేని దుర్గాదేవిని సన్మానిస్తున్న మాజీ మంత్రి రోజా

నింద్ర, అక్టోబరు 6 ప్రభాతవార్త:
నింద్ర ఎంపీపీగా నాగినేని దుర్గాదేవి సోమవారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో పదవీ స్వీకారం చేశారు. గత ఎంపీపీ వ్యక్తిగత కారణాల చేత రాజీనామా చేయడం వలన ఖాళీ ఏర్పడిన ఎంపీపీ పదవికి మొదటి వైస్ ఎంపీపీ నాగినేని దుర్గాదేవిని ఎంపీపీ పదవీ బాధ్యతలు చేపట్టాలని కలెక్టర్ ఆదేశానుసారంగా ఎంపీడీవో శివప్రసాద్‌వర్మ నాగినేని దుర్గాదేవిచే ఎంపీపీ పదవీ ప్రమాణం చేయించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి రోజా ముఖ్య అతిథిగా విచ్చేసి ఎంపీడీవో శివప్రసాద్, ఎంపీటీసీలు తప్ప మిగతా ఎవరూ కూడా కార్యాలయానికి రాకూడదని నగరి రూరల్ సీఐ భాస్కర్ చేత సర్పంచ్‌లను, మాజీ మంత్రి రోజాలను లోనికి రానీయకుండా అడ్డుకున్నారు. దీంతో మాజీ మంత్రి రోజా జిల్లా కలెక్టర్ దృష్టికి ఫోన్ ద్వారా తెలపగా కలెక్టర్ సానుకూలంగా స్పందించి కార్యాలయానికి లోనికి అనుమతి మంజూరు చేయడంతో అందరూ వెళ్లి ఎంపీపీ పదవీ స్వీకారంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ దీప, రెండవ వైస్ ఎంఎంపీ సుబ్బారామ్, ఎంపీటీసీలు విజేష్, కో-ఆప్షన్ మెంబరు అనిల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

షార్‌లో ప్రపంచ అంతరిక్ష వారోత్సవాలు ప్రారంభం

సూళ్లూరుపేట, అక్టోబర్ 6 ప్రభాతవార్త
సతీష్‌ధవన్ స్పేస్ సెంటర్ శ్రీహరికోటలో ప్రపంచ అంతరిక్ష వారోత్సవాలు సోమవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. శ్రీహరికోటలోని బ్రహ్మప్రకాష్ హాల్లో షార్ డైరెక్టర్ ఇఎస్ పద్మకుమార్, ముఖ్య అతిథిగా హాజరైన డాక్టర్ రఘునాథన్ శ్రీఆనంద్ తదితరులు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రపంచ అంతరిక్ష వారోత్సవాలకు శ్రీకారంచుట్టారు. ఈ సందర్భంగా పూణె ఆస్ట్రానమి, ఆస్ట్రోఫిజిక్స్ ఇంటర్ యూనివర్శిటీ సెంటర్ డైరెక్టర్ డాక్టర్ రఘునాథన్ శ్రీఆనంద్ మాట్లాడుతూ శ్రీహరికోటలో జరుగుతున్న రాకెట్ ప్రయోగాలు సాధిస్తున్న విజయాలు భారతదేశ అంతరిక్ష ప్రగతికి తార్కాణమని అన్నారు. ఆస్ట్రానమి, ఆస్ట్రోఫిజిక్స్ గురించి మాట్లాడుతూ అంతరిక్ష ప్రగతికి ఆస్ట్రానమి, ఆస్ట్రోఫిజిక్స్ సబ్జెక్టులకు సంబంధం ఉందన్నారు. వీటివలన అంతరిక్షంలో ఉన్న పరిస్థితులను అంచనా వేయడానికి దోహదపడుతుందని తెలిపారు. షార్ డైరెక్టర్ ఇఎస్ పద్మకుమార్ మాట్లాడుతూ ప్రపంచ అంతరిక్ష వారోత్సవాలు ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, ఒడిస్సా రాష్ట్రాల్లో మూడురోజులు పాటు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. డ్రీమ్ ఆఫ్ లివింగ్ స్పేస్ ఘనత సాధించేందుకు ఇస్రో ఆధ్వర్యంలో నిర్విరామ కృషి జరుగుతుందని తెలిపారు. ఇస్రోలో పనిచేస్తున్న ప్రతి ఒక్కరి సహకారంతో అంతరిక్ష ప్రగతిలో మైలురాళ్లను అధికమించేందుకు ముందుకు పోతున్నామని చెప్పారు. షార్ కంట్రోలర్ రమేష్‌బాబు మాట్లాడుతూ గగన్‌యాన్‌పై అన్ని పరీక్షలు జరుగుతున్నాయని, అవి డిసెంబర్‌లో పూర్తికావచ్చని చెప్పారు. 2040 నాటికి మానవసహిత రాకెట్ ప్రయోగం జరిగేవిధంగా ఇస్రో ప్రణాళికలు రూపొందిస్తుందని తెలిపారు. సోమవారం పిఎస్ఎల్‌వికి సంబంధించిన మోటార్‌టెస్ట్, ఎల్‌విఎం-3 ఎస్200 మోటార్ల పరీక్షలు విజయవంతం అయ్యాయని తెలిపారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథి రఘునాథన్ శ్రీఆనంద్‌ను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో షార్ అసోసియేట్ డైరెక్టర్ ముత్తు చెలియన్, ఎల్ఎస్ఎస్ మేనేజర్, ప్రపంచ అంతరిక్ష వారోత్సవ ప్రాజెక్టు ఛైర్మన్ శంభుప్రసాద్‌లు పాల్గొన్నారు.

పశు వైద్య కళాశాలలో జాతీయ సమావేశం

- ఎస్వీ పశువైద్య కళాశాల అసోసియేట్ డీన్ జగపతి రామయ్య

తిరుపతి విద్య అక్టోబర్ 6 ప్రభాత వార్త:
పశువులకు సంక్రమించే వ్యాధులు,నిర్ధారణ, నివారణ,శస్త్ర చికిత్సలపై ఈ నెల 8,9వ తేదీలలో ఎస్వీ పశు వైద్య కళాశాలలో జాతీయ సమావేశం నిర్వహించనున్నట్లు కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ జగపతి రామయ్య అన్నారు.ఈ మేరకు సోమవారం ఆయన తన ఛాంబర్‌లో విలేకరుల సమావేశంలో వివరాలను వెల్లడించారు.ఆయన మాట్లాడుతూ ఎస్వీ పశు వైద్యకళాశాలలోని పశువైద్య చికిత్స,బోధన విభాగము ఆధ్వర్యంలో రెండు రోజుల జాతీయ సమావేశము నిర్వహించడం జరుగుతుందన్నారు. సమావేశానికి దేశంలోని 144 రాష్ట్రాల నుండి 250 మంది పశువైద్య విద్యార్థులు పాల్గొనున్నారన్నారు.ఈ జాతీయ సమావేశములో మొత్తము 14 టెక్నికల్ సెషను నిర్వహించడం జరుగుతుందన్నారు.పశువులలో వచ్చే వ్యాధుల నిర్ధారణ, చికిత్స,నివారణ,శస్త్ర చికిత్సలు, గర్భకోశ వ్యాధులపై శాస్త్రీయపరమైన చర్చలు నిర్వహించడం జరుగుతుందన్నారు.250 మంది పశు వైద్య విద్యార్థులు పవర్ ప్రెజెంటేషన్ నిర్వహించడం జరుగుతుందన్నారు.ఈ కార్యక్రమము ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథిగా తమిళనాడు పశువైద్య విశ్వవిద్యాలయం రిటైర్డ్ వీసీ ప్రొఫెసర్ ఎస్.తిలగర్ హాజరుకానున్నారన్నారు.ప్రత్యేక అతిథిగా ఎస్వీ వెటర్నరీ యూనివర్శిటీ వీసీ ప్రొఫెసర్ జె.వీ.రమణ,గౌరవ అతిథిగా ఇండియన్ సొసైటీ ఫర్ అడ్వాన్సెల్మెంట్,కెనైన్ ప్రాక్టీస్ ప్రొఫెసర్ ఎస్.ప్రతాభన్ హాజరుకానున్నట్లు ఆయన తెలిపారు. అలాగే ఎస్వీ పశువైద్య విశ్వవిద్యాలయము డీన్ ఆఫ్ వెటర్నరీ సైన్స్ ప్రొఫెసర్ కే.వీరబ్రహ్మయ్య సభాదక్షులుగా వ్యవహరిస్తారని,ఈ కార్యక్రమానికి చైర్మన్‌గా ప్రొఫెసర్ పి.జగపతి రామయ్య, ఆర్గనైజింగ్ సెక్రటరీగా ప్రొఫెసర్ వి. వైకుంఠ రావు, డాక్టర్ రాంబాబునాయక్ నిర్వహణ బాధ్యతలు చేపట్టనున్నట్లు ఆయన వివరించారు.

యదేచ్ఛగా తరలిపోతున్న స్వర్ణముఖి ఇసుక...

రాత్రి ట్రాక్టర్లు, పగలు టైరు బండ్లతో తరలింపు

స్వర్ణముఖి నది నుంచి ఇసుక తరలించగా పిల్లర్ దృశ్యం, వంతెన వద్ద స్క్రాంచ్ తవ్వుతున్న దృశ్యం

శ్రీకాళహస్తి,అక్టోబర్ 6 ప్రభాతవార్త :
శ్రీకాళహస్తి నియోజకవర్గంలోని నాయకులకు స్వర్ణముఖి నది ఓ కామధేనువుగా మారింది. రాత్రి అయితే ఏర్పేడు, శ్రీకాళహస్తి రూరల్,అర్బన్ ప్రాంతాలకు చెందిన ఇసుకాసురులు ట్రాక్టర్లు, టిప్పర్లతో ఇసుకను తోడేస్తున్నారు. ఇక పగలు పట్టణంలోని వందలాది టైర్‌బండ్లు వంతెనల వద్ద ఇసుకను తవ్వేస్తున్నారు. ప్రభుత్వం ఉచితంగా ఇసుక అంటూ ప్రకటించినా లబ్దిదారుల కన్నా దళారులకే ఎక్కువ లాభం చేకూరుతుంది. ఈ నేపథ్యంలో సోమవారం వంతెన వద్ద ఇసుకను తరలించేందుకు అడ్డుకున్న దర్గా మిట్టకు చెందిన యువకులు అడ్డుకట్ట వేసారు. ట్రంచ్‌ను ఏర్పాటు చేసారు.అధికారులు అయితే ప్రేక్షక పాత్ర వహిస్తున్నారు. తిలాపాపం తలా కొంచెం అన్నట్లు పంచుకుంటున్నారు. శ్రీకాళహస్తి నియోజకవర్గంలోని శ్రీకాళహస్తి రూరల్,ఏర్పేడు,తొట్టంబేడు మండలాల నాయకులకు స్వర్ణముఖి నది ఓ కామధేనులా మారింది. ఏ పార్టీ అధికారంలో ఉన్నా అధికారుల సహకారంతో వివిధ దందాలు సాగుతున్నాయి. శ్రీకాళహస్తి నియోజకవర్గంలో ఇసుక తరలింపు దందా కాసుల సిరులు కురిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో పైసా పెట్టుబడి లేకుండా ఇసుక దందా సాగుతుంది.గతంలో ఏర్పేడు మండలం కేంద్రంగా మునగల పాళెం పరిసరాల్లో స్వర్ణముఖిని ఖాళీ చేయగా ప్రస్తుతం శ్రీకాళహస్తి మండలంలోని రామాపురం, వేదాంలు వేదికలుగా స్వర్ణముఖి నదిని ఖాళీ చేసే పథకం అమలు జరుగుతుంది.ఏర్పేడు మండలంలోని బండారుపల్లి నుంచి శ్రీకాళహస్తి పట్టణం వరకు స్వర్ణముఖి నది విస్తరించి ఉంది. ఇక్కడ పుష్కలంగా ఇసుక మెటలు వేసింది.దీనిని ఈ ప్రాంతానికి చెందిన ఓ నాయకుడు తన ఇష్టారాజ్యంగా దంప్‌చేసుకొని జేబులు నింపుకుంటున్నారు. శ్రీకాళహస్తిలోని ఎవరైనా సామాన్యుడు నిరుపేద ఇళ్ళు నిర్మించుకోవాలంటే ఇసుక అనుమతి కోసం సంబంధిత అధికారుల చుట్టూ ప్రదక్షిణలు చేయాలి. విఆర్ఓ నుంచి అనుమతి కావాలి, ఆయన నుంచి ఉత్తరం ఉండాలి. ఇందుకు రెండు మూడు రోజులు రెవెన్యూ కార్యాలయం చుట్టూ ప్రదక్షిణలు చేయాలి. కానీ అధికార పార్టీ సిపార్సు కాబట్టి నిబంధనలు వర్తించవన్నట్లు మారింది. ఇక ఏ శాఖకు ఆ శాఖ అధికారులకు ముడుపులు ఇకూడా అందుతున్నట్లు జనం చర్చించుకుంటున్నారు. గతంలో స్వర్ణముఖి తీరంలో ఇసుక చేతులతో తొలగిస్తే మంచినీళ్ళు లభించేది. అలాంటి నేడు నది సుమారు సది నుంచి 15 అడుగుల లొతుకు కుంగిపోయింది. అయినా ఇప్పటికీ ఇసుక తరలింపును వదలిపెట్టడం లేదు.నదిలో ఇసుక తరలింపుతో భూగర్భజలాలు అడుగింటిపోతున్నాయి. ఇప్పటికైనా అధికారులు ఇసుక తరలింపును అడ్డుకోకుంటే భావి తరాలకు ద్రోహం చేసిన వారౌతారని చర్చించుకుంటున్నారు.

ట్రాక్టర్ దొంగతనాలకు పాల్పడుతున్న ముగ్గురు అరెస్టు

గుడిపాల, అక్టోబర్ 6 ప్రభాతవార్త: గుడిపాల మండల పరిధిలో ట్రాక్టర్ దొంగతనాలకు పాల్పడుతున్న ముగ్గురు నిందితులను ఎస్ఐ రామ్మోహన్ అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. మండలంలోని పసుమంద గ్రామంకు చెందిన వినాయకం, కృష్ణజిమ్మాపురం గ్రామంకు చెందిన చిట్టిబాబు నాయుడు ట్రాక్టర్లు దొంగతనానికి గురయ్యాయి. ఈ మేరకు వారు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. వీరి ఫిర్యాదు మేరకు విచారణ ప్రారంభించిన ఎస్ఐ రామ్మోహన్ సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించి సిసి కెమెరా ఫుటేజ్‌లతో దర్యాప్తు చేయగా ఈ ట్రాక్టర్లు తమిళనాడు రాష్ట్రం మేల్పాడి వైపుకు వెళ్ళినట్లు నిర్ధారించారు. ఈ మేరకు గుడిపాల పోలీసులు రాష్ట్ర సరిహద్దు ప్రాంతంలో గట్టి నిఘా వుంచారు. ఈ క్రమంలో గుడిపాల పోలీసులు సోమవారం చలిచీమలపల్లి వద్ద వాహనాల తనిఖీ నిర్వహిస్తుండగా కమ్మతిమ్మపల్లి వైపు నుండి మేల్పాడి వైపుగా రెండు ట్రాక్టర్లు వాటి ముందు ద్విచక్రవాహనాలతో నిందితులు వస్తుండటం గమనించారు. పోలీసులను చూసి నిందితులు పారిపోవడానికి ప్రయత్నించగా ఎస్ఐ రామ్మోహన్, సిబ్బంది వారిని వెంబడించి పట్టుకుని విచారించగా ట్రాక్టర్లు దొంగతనం చేసిన విషయంను అంగీకరించారు. ఈ మేరకు తమిళనాడు రాష్ట్రానికి చెందిన బద్రి(26), కార్తీక్(19), రామమణి(47)లను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ రామ్మోహన్ పేర్కొన్నారు.

సిఎం చంద్రబాబు ఆధ్వర్యంలో సస్యశ్యామలం

గుడిపాల. అక్టోబర్ 6 ప్రభాతవార్త: సిఎం నారా చంద్రబాబునాయుడు ఆధ్వర్యంలో రాష్ట్రం సస్యశ్యామలంగా విరజిల్లుతోందని నియోజకవర్గ తెలుగు మహిళ అధికార ప్రతినిధి తుమ్మల లలిత పేర్కొ న్నారు. గుడిపాల గ్రామ పంచాయతీలోని నారాయణ రెడ్డి చెరువు నిండి మొరవ వెళ్ళడంతో సోమవారం నియోజకవర్గ తెలుగు మహిళ అధికార ప్రతినిధి తుమ్మల లలిత జలహారతి ఇచ్చి పూజ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన సూపర్ సిక్స్ హామీల్లోని ప్రతి పథకం అమలు చేసి ప్రజా రంజక పాలన సాగించడం ప్రభుత్వానికి సారధ్యం వహిస్తున్న ఒక్క సిఎం నారా చంద్రబాబునాయుడుకే సాధ్యమన్నారు. కూటమి పాలనలో వర్షాలు సమృద్ధిగా కురిసి వాగులు, చెరువులు నిండటంతో రైతులు పంటలు సాగు చేయడానికి అనుకూలమైన వాతావరణం ఏర్పడిందన్నారు. ఈ స్థానిక తెలుగుదేశం నాయకులు రవినాయుడు, గోపి, యోగానందం, గ్రామస్తులు పాల్గొన్నారు.

గుడిపాల ఎస్ఐ దౌర్జన్యం

చిత్తూరు, అక్టోబర్ 6 ప్రభాతవార్త: గుడిపాల ఎస్ఐ రామ్మోహన్ తనను స్టేషన్‌కు పిలిచి దౌర్జన్య గా రక్తగాయాలు అయ్యేలా కొట్టారని గుడిపాల మండలం 189 కొత్తపల్లి గ్రామంకు చెందిన యశ్వంత్ ఆరోపించాడు. చిత్తూరు ప్రెస్‌క్లబ్‌లో సోమవారం యశ్వంత్ విలేకరులతో మాట్లాడుతూ గత నెల జరిగిన వినాయక చవితి వేడుకల్లో గ్రామంలో ఉత్సవాలు జరిగాయని, ఈ వేడుకల్లో యువత అందరు పాల్గొన్నామన్నారు. వినాయక నిమజ్జనం సందర్భంగా యువత డిజె కార్యక్రమం ఏర్పాటు చేసిందని, ఈ కార్యక్రమంలో రాజకీయ పార్టీలకు చెందిన పాటలకు గ్రామంలోని యువత డాన్స్ చేశారన్నారు. అయితే తాను వైకాపా పాటకు డాన్స్ చేశానని చెప్పి వినాయక నిమజ్జనం జరిగిన ఇన్ని రోజులకు తనపై ఎస్ఐ కక్షకట్టి దౌర్జన్యం చేశారని ఆరోపించారు. కొట్టిన విషయం ఎవరికైనా చెబితే భవిష్యత్తు లేకుండా చేస్తానని ఎస్ఐ బెదిరించారని వాపోయాడు. ఎస్ఐ తనపై చేయి చేసుకోవడంతో తాను తీవ్రంగా గాయపడ్డానని, తనకు న్యాయం జరుగకుంటే ఎస్పీ కమీషన్‌కు ఫిర్యాదు చేస్తానన్నారు. ఈ విషయంపై స్పందించి ఎస్పీ తుషార్ డూడి విచారించి తనకు న్యాయం చేయాలని యశ్వంత్ కోరారు.

అపోలో యూనివర్సిటీ విద్యార్థికి రాష్ట్రపతి అవార్డు

చిత్తూరు, అక్టోబర్ 6 ప్రభాతవార్త: అపోలో యూనివర్సిటీ విద్యార్థి డి.రెడ్డి జీశ్ణు దేశ స్థాయిలో అరుదైన గౌరవాన్ని సాధించారు. జీతీయ సేవా పథకం (ఎస్ఎస్ఎస్) 2022-23 సంవత్సరం వాలంటీర్ విభాగంలో జాతీయ స్థాయి సేవా పురస్కా రంను రాష్ట్రపతి ద్రౌపతిముర్ము చేతుల మీదుగా న్యూఢిల్లీలోని రాష్ట్రపతి భవన్‌లో సోమవారం అందుకున్నారు. డి.రెడ్డి జీశ్ణు ది అపోలో యూని వర్సిటీ స్కూల్ ఆఫ్ మేనేజ్‌మెంట్‌లో ఎంబిఎ ద్వితీయ సంవత్సరం చదువుతున్నారు. రెడ్డి జీశ్ణు సమాజ సేవా కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటూ పలు గ్రామీణ ప్రాంతాల్లో ప్రజా ప్రయోజన కార్యక్రమాలు చేపట్టారు. ఆరోగ్య అవగాహన, పర్యావరణ సం రక్షణ, రక్తదానం, గ్రామాల్లో శుభ్రతా కార్యక్రమాలు, మహిళా శ్రేయస్సు వంటి రంగాల్లో విశేషంగా సేవలు అందించారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మహిళల్లో మాసిక పరిశుభ్రతపై అవగా హన కల్పించి అవసరమైన ప్యాడ్లను పంపిణీ చేశారు. అలాగే ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న పేద విద్యార్థులకు విద్యా ఫీజులు చెల్లించి సాయం చేశారు. చిత్తూరు నగరంలో వర్షపునీటి నిల్వ నిర్మాణాలు చేపట్టి విద్యుత్, ఇంధన పొదుపుపై ప్రజలను చైతన్యం చేశారు. ఇప్పటి వరకు డి.రెడ్డి జీశ్ణు 11,130 మొక్కలు నాటడంతో పాటు పలు రక్తదాన శిబిరాలు నిర్వహించి 21 సార్లు రక్తదానం చేశారు. దేశవ్యా ప్తంగా లక్షలాది ఎన్ఎస్ఎస్ వాలంటీర్లలో అత్యుత్తమ సేవలు అందించిన కొద్దిమందిని మాత్రమే జాతీయ గౌరవానికి ఎంపిక చేస్తారని, రెడ్డి జీశ్ణు రాష్ట్రపతి నుండి అవార్డును అందుకోవడం యూనివ ర్సిటీకి గర్వకారణమని వైస్ ఛాన్సలర్ డాక్టర్ హెచ్.వినోద్‌భట్, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎం.పోతరాజు, స్కూల్ ఆఫ్ మేనేజ్‌మెంట్‌డీన్ డాక్టర్ రామయ్య ఇటుమల్ల, ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్ హేమాద్రిరెడ్డిలు అభినందించారు.

గ్రామాల్లో వైకాపా బలోపేతంకు చర్యలు

బంగారుపాళ్యం, అక్టోబర్ 6 ప్రభాతవార్త: గామీణ ప్రాంతాల్లో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేయాలని మాజీ ఎమ్మెల్యే, పూతలపట్టు నియోజక వర్గ వైకాపా సమన్వయకర్త డాక్టర్ సునీల్‌కుమార్ పిలుపునిచ్చారు. సోమవారం సాయంత్రం మాజీ జడ్పీ ఛైర్మన్ ఎంబి కుమార్‌రాజా స్వగృహంలో మండల స్థాయి వైకాపా కార్యకర్తల సమావేశం జరిగింది. డాక్టర్ సునీల్‌కుమార్ మాట్లాడుతూ రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం ప్రజల మన్ననలు పొందలేకపోతున్నదని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజలకు తెలియజేయాలని చెప్పారు. సూపర్ సిక్స్ రాష్ట్రంలో అట్టర్‌ఫ్లాప్ అయ్యిందన్నారు. తిరిగి రాష్ట్రంలో వైకాపా అధికారం చేపట్టి ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ప్రమాణ స్వీకారం చేసేలా ప్రతి కార్యకర్త కృషి చేయాలని పిలుపునిచ్చారు. ప్రతి గ్రామకమిటీలో 50 మందితో కార్యవర్గం ఏర్పాటు చేయాలని అనంతరం బూత్ కమిటీలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఇందులో బాగంగా ప్రతి గ్రామ పంచాయతీలో విస్తృతంగా పర్యటించి గ్రామ కమిటీల ఏర్పాటుకు శ్రీకారం చుట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే లలితకుమారి, వైకాపా మండల కన్వీనర్ రామచంద్రారెడ్డి, వైస్ ఎంపిపి శిరిష్‌రెడ్డి, పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నీటి తొట్లును పట్టించుకోండి!

పాలసముద్రం,అక్టోబర్ 6 ప్రభాతవార్త: మండలంలో ఉపాధి హామీ నిధులతో కూటమి ప్రభుత్వం ప్రతిష్టా త్మకంగా తీసుకొని ఉపాధి హామీ నిధులతో పల్లెపం డుగ కార్యక్రమంలో భాగంగా మండలంలో లక్షల రూపాయలు వెచ్చించి పశువుల కోసం నీటి తొట్టిలను నిర్మించారు. నిర్మించిన వ్యక్తులు తొట్టిల నిర్మాణం పూర్తయిన వెంటనే చేతులు దులుపుకొన్నారు. ప్రస్తుతం ఆ తొట్టులలో పాచి పట్టి కలుషితమైన నీరుగా తయారైంది. ప్రభుత్వం పశువుల దాహార్తి తీర్చడం కోసం నిర్మించిన తొట్టిలో నీరు తాగి వ్యాధుల బారిన పడే అవకాశం ఉందని, వాటిని శుభ్రం చేసేది ఎవరు అని పశువుల యజమానులు ప్రశ్నిస్తున్నారు. ఇందులో భాగంగా పాలసముద్రం మండల కేంద్రానికి కూతవేటు దూరంలో ఉన్న మణిపురం ఎస్‌టి కాలనికి వెళ్లే దారిలో కనికలమ్మగుడి వద్ద ఒక తొట్టిని నిర్మించారు. ఆ తొట్టికి నీటి సౌకర్యం లేదు, ఇలా నీటి సౌకర్యం లేని తొట్టిని ఎందుకోసం ఎవరి ప్రయోజనం కోసం ఇక్కడ నిర్మించారు అని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. ప్రస్తుతం ఆ నీటి తొట్టి వర్షపు నీటితో కలుషితమైనది. పశువుల నీటి తొట్టె లపై అధికారులకు నిర్లక్ష్యం ఎందుకు అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. దీనిపై జిల్లా స్థాయి అధికారులు స్పందించి మండలం పూర్తిగా సందర్శించి, మొత్తం నీటి తొట్టెలను ఎప్పటికప్పుడు శుభ్రం చేసే విధంగా ఆదేశాలు జారీ చేయాలని మండల ప్రజలు కోరుకుంటున్నారు.

చింతామణిలో పవన్ కళ్యాణ్‌తో వేణుగోపాల్ రెడ్డి భేటీ

పుంగనూరు, అక్టోబర్ 6 ప్రభాతవార్త రాష్ట్ర డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్ తో పుంగనూరు నియోజకవర్గ జనసేన నాయకుడు డాక్టర్ వేణుగోపాల్ రెడ్డి సోమవారం కర్ణాటక రాష్ట్రం చింతామణిలో భేటీ అయ్యారు. చింతామణి పట్టణంలో జరిగిన జస్టిస్ గోపాల్ గౌడ్ జన్మదిన వేడుకలలో పాల్గొనేందుకు బెంగళూరు నుంచి రోడ్డు మార్గం ద్వారాఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ చింతామణి చేరుకున్నారు. బెంగళూరులో ఆయనకు స్వాగతం పలికిన వేణుగోపాల్‌రెడ్డి పవన్ కళ్యాణ్‌తో పార్టీ చింతామణి చేరుకున్నారు. గోపాల్ గౌడ్ జన్మదిన వేడుకలలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలో పార్టీ పరిస్థితులు గురించి పవన్ కళ్యాణ్ క్షుణ్ణంగా అడిగి తెలుసుకున్నట్లు తెలిసింది.

శ్రీ భక్త కనకదాసు విగ్రహావిష్కరణకు సహకరించిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు

తిరుపతి హెల్త్, అక్టోబర్ 6, ప్రభాతవార్త శ్రీ భక్త కనకదాసు విగ్రహావిష్కరణకు సహకరించిన ప్రతి ఒక్కరికి ఏపి రాష్ట్ర కురుబ, కరుమ, కురువ సంఘం నాయకులు ధన్యవాదాలు తెలిపారు. సోమవారం తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ నెల 12వ తేది ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కురుబ, కురుమ, కురువ సంఘం 9 సంవత్సరాలు పూర్తి చేసుకుని 10వ వార్షికోత్సవ సభ, సౌత్ ఇండియా ఓబీసీ సెమినార్ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జబ్బల శ్రీనివాసులు కురుబ కురుమ కురువ సంఘం రాష్ట్ర అధ్యక్షులు, లాయర్ రవిశంకర్ అన్నమయ్య జిల్లా కురవ సంఘం గౌరవ అధ్యక్షులు, తరిగొండ ఈశ్వరయ్య అధ్యక్షులు, శ్రీనివాసులు తంబళ్లపల్లి అధ్యక్షులు, రామాంజులు మదనపల్లి అధ్యక్షులు, రవి చిన్నమండెం అధ్యక్షులు, నాగేంద్ర లక్కిరెడ్డిపల్లి అధ్యక్షులు, తదితరులు పాల్గొన్నారు.

గణనాధుని దర్శించుకున్న కర్నాటక హైకోర్టు న్యాయమూర్తి

కాణిపాకం, అక్టోబర్ 6 ప్రభాతవార్త: కర్నాటక రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ అరవింద్ సోమవారం కుటుంబసమేతంగా కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయక స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ దర్శనార్థం వచ్చిన ఆయనకు ఆలయ ఏఈఓ రవీంద్రబాబు, అర్చకులు ఆలయ మర్యాదలతో రాజగోపురం వద్ద ఘనంగా స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం వారు స్వామివారి సేవలో పాల్గొన్నారు. వారికి వేదమంపడపంలో వేదపండితులు ఆశీర్వచనం చేసి స్వామివారి శేషవస్త్రాలను, ప్రసాదాలను అందజేశారు. వారి వెంట ఆలయ సూపరెండెంట్ వాసు, టెంపుల్ ఇన్స్పెక్టర్ చిట్టిబాబు, చిత్తూరు కోర్టు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

తెలుగు పండితుల సమస్యను పరిష్కరించినందుకు కృతజ్ఞతలు

సదుం అక్టోబర్ 6 ప్రభాతవార్త రాష్ట్రంలోని తెలుగు పండితులకు గత పదేళ్లుగా పదోన్నతి లేక అనేక ఇబ్బందులు పడుతున్న వారికి ఎన్డీఏ ప్రభుత్వం తగిన న్యాయం చేసినందుకు గాను పట్ట భద్రుల ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ ను సోమవారం మదనపల్లిలో కలిసి కృతజ్ఞతలు తెలియజేసినట్లు ఏపీ సిపిఎస్ ఎంప్లాయిస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు పచ్చార్ల సుధాకర్ తెలిపారు. అదే విధంగా ఉద్యోగులు గత ప్రభుత్వంలో చాలా ఆర్థిక సమస్యలను ఎదుర్కొన్నారని అన్నారు. ఎన్డీఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి దాదాపు ఒకటిన్నర సంవత్సర కాలం పాటు అయిందని కనీసం ఈ దీపావళికైనా రెండు డిఏ లను ప్రకటించాలని కోరారు. అదే విధంగా పీఆర్సీ కమిటీ ని నియమించాలని, కమిటీ నివేదిక లోపు మధ్యంతర భృతి ప్రకటించాలని కోరారు. అదేవిధంగా సిపిఎస్ విధానం రద్దు పట్ల తగిన నిర్ణయం తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సిపిఎస్ నాయకులు ములవగిలి సుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.

బిడ్డకు తల్లిపాలు శ్రేయస్కరం

సదుం అక్టోబర్ 6 ప్రభాతవార్త పుట్టిన బిడ్డకు తప్పనిసరిగా తల్లిపాలు అందించాలని వాటి వల్ల బిడ్డ శ్రేయస్కరంగా ఉంటారని పులిచెర్ల ఐసిడిఎస్ సిడిపిఓ వాణి శ్రీదేవి అన్నారు. సోమవారం మండల పరిధిలోని జోగివారిపల్లె అంగన్వాడీ కేంద్రంలో ఎనిమిదవ రాష్ట్రీయ పౌష్టికాహార మాసోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా తల్లిపాల ప్రాముఖ్యత గురించి ఆహారం పైన అవగాహన కల్పించారు. పోషకాహారానికి సంబంధించి పలు రకాల పోషకాహారాలను ప్రదర్శించారు. వాటి తయారీ గురించి వాడుక గురించి ప్రజలకు తెలియజేశారు. అంగన్వాడి కేంద్రాలు అందజేసే పౌష్టికాహారాన్ని పిల్లలకు, కిశోర బాలికలకు, బాలింతలకు గర్భవతులకు అందజేయాలన్నారు. గర్భవతులకు సీమంతం చేశారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్వైజర్ మల్లీశ్వరి, అంగన్వాడి కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు.

సమస్యలను పరిష్కరించడంలో తాసిల్దార్ సేవలు అభినందనీయం

పూతలపట్టు, అక్టోబర్ 6, ప్రభాతవార్త పూతల పట్టు మండల తాసిల్దార్ రమేష్ బాబు సేవలు అభినందనీయమని మండల ప్రజలు కొనియా డుతున్నారు. తాసిల్దార్ కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల రూపంలో వినతి స్వీకరించి దాని పరిష్కారాన్ని అక్కడే చూపుతూ వీఆర్వోలని. సర్వేర్లని ఎప్పటికప్పుడు ఆ అర్జీ తాలూకు సమస్య ఏమైందని తెలుసుకుంటూనే క్షేత్రస్థాయిలో పర్యటించి అక్కడే పరిష్కార మార్గాన్ని చూపుతున్న తాసిల్దార్ రమేష్ బాబు మండల ప్రజల పై చూపుతున్న ప్రేమాభిమానాలు అమోఘమని పూతలపట్టు మండల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

పికెఎం ఉడా ఛైర్మన్‌గా డా॥ బిఆర్ సురేష్‌బాబు ప్రమాణస్వీకారం

కుప్పం, అక్టోబర్ 6 ప్రభాతవార్త పలమనేరు, కుప్పం, మదనపల్లి అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (పికెఎం ఉడా)ఛైర్మన్‌గా డా॥ బిఆర్ సురేష్‌బాబు ప్రమాణస్వీకార కార్యక్రమం అట్టహాసంగా జరిగింది. మదనపల్లిలో ఉడా కార్యాలయం ఆవరణలో సోమవారం ఆయన చేత అధికారులు ప్రమాణస్వీకారం చేయించారు. ఈకార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా ప్రభుత్వ విప్‌లు డా॥ కంచర్ల శ్రీకాంత్, యార్లగడ్డ వెంకటరావు, చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్, మదనపల్లి ఎమ్మెల్యే షాజహాన్‌బాషా, పుత్తూరు ఎమ్మెల్యే గాలి భాను ప్రకాష్, ఆర్టీసీ వైస్ ఛైర్మన్ పిఎస్ మునిరత్నం, టిటిడి బోర్డు సభ్యుడు వైద్యం శాంతారాం, రాష్ట్ర కార్యదర్శి గోపీనాథ్ హాజరయ్యారు. కుప్పం నియోజకవర్గంలోని నాలుగు మండలాల నేతలు, కార్యకర్తలు, మున్సిపల్ కౌన్సిలర్లు మదన పల్లిలో జరిగిన అధిక సంఖ్యలో హాజరై ఉడా ఛైర్మన్ డా॥ బిఆర్ సురేష్‌బాబును ఘనంగా సత్కరించారు.

నేడు కుప్పంలో షీ లీడ్స్ ఆంధ్ర కార్యక్రమం : కడ పి.డి

కుప్పం, అక్టోబర్ 6 ప్రభాతవార్త సిఎం చంద్రబాబు నాయుడు ఆదేశాలతో కుప్పం ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ (కడ), జైపూర్‌కు చెందిన ఫ్రంట్లైయర్ మార్కెట్స్ సంస్థ అధ్వర్యంలో మంగళవారం కుప్పం కడ కార్యాలయంలో షీ లీడ్స్ ఆంధ్ర కార్యక్రమం నిర్వ హించనున్నట్లు కడ ప్రాజెక్ట్ డైరెక్టర్ వికాస్ మర్మత్ ప్రకటనలో తెలిపారు. ఈస ందర్భంగా గ్రామీణ మహిళా వ్యాపార వేత్తల మేళా 2025 కార్యక్రమం చేపట్టడం జరుగుతుం దన్నారు. ఈ మేళాలో నమోదు చేసుకునేందుకు ఆసక్తిగల మహిళలు ఆధార్, పాన్ కార్డ్, ఆధార్‌లింక్ మొబైల్ నెం, ఏదేని గుర్తింపు కార్డు, బ్యాంకు పాస్ పుస్తకం, ఎస్‌హెచ్‌జి పేరు, రెండు పాస్‌పోర్ట్ ఫోటోలు, దుకాణ చిరునా మాలతో రావాలని సూచించారు. ఈ అవకాశాన్ని నియోజకవర్గ మహిళలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

కలెక్టర్‌చే అవార్డు అందుకున్న ఎఎంసి ఛైర్మన్ జిఎం రాజు

కుప్పం,అక్టోబర్ 6ప్రభాతవార్త స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా చిత్తూరు జిల్లా స్థాయిలో ఉత్తమ రైతు బజార్ అవార్డు కుప్పం చంద్రన్న మార్కెట్ యార్డుకు దక్కింది. సోమవారం ఈ అవార్డును చిత్తూరులో జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్ చేతుల మీదుగా కుప్పం ఎఎంసి ఛైర్మన్ జిఎం రాజు, డైరెక్టర్లు ఉదయ్, భానుమూర్తి, సుబ్బు, పవన్, ఎఎంసి కార్యదర్శి అందుకున్నారు. ఛైర్మన్ జిఎం రాజు మాట్లాడుతూ కుప్పం మార్కెట్ యార్డ్‌ను మరింత పరిశుభ్రంగా ఉంచేలా చర్యలు తీసుకుంటామన్నారు. సహకరించినరైతులు, వ్యాపారులకు కృతజ్ఞతలు తెలిపారు.

కుప్పంలో ప్లాస్టిక్ నిషేధానికి ప్రజలు సహరించాలి

కుప్పం, అక్టోబర్ 6 ప్రభాతవార్త స్వచ్ఛ కుప్పం - స్వర్ణ కుప్పం సాధనలో భాగంగా కుప్పం మున్సిపల్ పరిధిలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధానికి ప్రజలు, దుకాణ దారులు సహకరి ంచాలని మున్సిపల్ కమీషనర్ శ్రీనివాసరావు కోరారు. పురపాలక పరిధిలోని హోటళ్లు, దుకాణాలు, కూరగాయల షాపులు, ఇతరషాపుల్లో యజమా నులు, కొనుగోలు చేసే ప్రజలు ప్లాస్టిక్ వాడకం నియంత్రించి పర్యావరణ పరిరక్షణకు స్వచ్ఛ కుప్పం సాధనకు తమవంతు కృషి చేయాలని కోరారు. సోమవారం ఇన్‌చార్జ్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ అధ్వర్యంలో పురపాలక సిబ్బంది పట్టణంలో పలు షాపుల్లో తనిఖీలుచేసి పది కిలోల ప్లాస్టిక్ స్వాధీనం చేసుకుని జరిమానాలు విధించినట్లు చెప్పారు.

స్వచ్ఛ ప్రభుత్వ ఆస్పత్రిగా ఎన్.కొత్తపల్లి పిహెచ్‌సి

కుప్పం,అక్టోబర్ 6 ప్రభాతవార్త జిల్లా స్థాయిలో ఉత్తమ స్వచ్ఛ ప్రభుత్వ ఆస్పత్రిగా మండలంలోని ఎన్. కొత్తపల్లి ప్రాథమిక ఆరోగ్యకేంద్రం ప్రథమస్థానంలో నిలిచింది. సోమవారం స్వచ్ఛ పిహెచ్‌సి అవా ర్డును వైద్యాధికారి డా॥ సుభాష్ రాజా జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్, ఎమ్మెల్యేలు గురజాల జగనో మ్హన్, మురళీమోహన్‌లచేతుల మీదుగా అందుకున్నారు. ఆస్పత్రి ప్రాంతాన్ని మరింత శుభ్రంగా ఉంచి రోగులకు స్వచ్ఛ వాతావరణంలో వైద్య సేవలు అందేలా చూస్తామని ఆయన తెలిపారు.

పోలీసులచే 4.79లక్షల విలువ చేసే కర్ణాటక మద్యం ధ్వంసం

శాంతిపురం, అక్టోబర్ 6 ప్రభాతవార్త వివిధకేసుల్లో పట్టుబడిన 4.79లక్షల విలువ చేసే కర్ణాటక అ క్రమ మద్యాన్ని జిల్లా ఎస్పీ తుషార్ డూడి, డిఎస్పీ పార్థసారథి ఆదేశాలతో రూరల్ సిఐ మల్లేష్ యాదవ్, రాళ్లబూదుగూరు ఎస్సై నరేష్‌లు సోమవారం జెసిబి యంత్రంతో ధ్వంసం చేయించారు. మొత్తం 8388 బాటిళ్లలోని 1,230లీటర్ల మద్యాన్ని ధ్వంసం చేశారు. అక్రమ మద్యంపై కఠినచర్యలు తీసుకుంటామని వారు పేర్కొన్నారు.

చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం

నేడు జరిగే వాల్మీకి జయంతి వేడుకలకు తరలిరండి

వాల్మీకులకు టిడిపి నేత సుకుమార్ బాబు ఆహ్వానం

పుంగనూరు, అక్టోబర్ 6 ప్రభాతవార్త పట్టణంలో మంగళవారం వాల్మీకి జయంతి వేడుకలు పెద్దఎత్తున నిర్వహిస్తున్నట్లు తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు, వాల్మీకి నాయకులు కనుమకుంట్ల సుకుమార్ బాబు పేర్కొన్నారు. సోమవారం ఆయన మాట్లాడుతూ శ్రీరాముడి జీవిత చరిత్రను రామాయణం రూపంలో ప్రజలకు అందించిన మహనీయుడు, వాల్మీకి కులంలో జన్మించిన మహాపురుషుడు వాల్మీకి మహర్షి అని, ప్రత్యేక వాల్మీకి జయంతి వేడుకగా నిర్వహిస్తున్నామన్నారు. ఈ ఏడాది పుంగనూరు పట్టణంలోని ముడియప్ప సర్కిల్ వాల్మీకి విగ్రహం వద్ద ఉదయం 10 గంటలకి మహర్షి వాల్మీకి జయంతి వేడుకలను వైభవంగా నిర్వహిస్తున్నామన్నారు. నియోజకవర్గంలోనినలుమూలలనుండి వాల్మీకి కులస్తులు తరలిరావాలని పిలుపునిచ్చారు.

పలమనేరు బస్టాండులో పోలీసుల తనిఖీలు

పలమనేరు టౌన్, అక్టోబర్ 6, ప్రభాతవార్త: పలమనేరు ఆర్టీసీ బస్టాండులో సోమవారం పలమనేరు సిఐ మురళీమోహన్ ఆధ్వర్యంలో పోలీసులు ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. రెండు రోజుల క్రితం గుర్తు తెలియని వ్యక్తులు ఓ మహిళ బస్సు నుండి దిగుతుండగా 150 గ్రాముల బంగారునగలు చోరీ చేశారు. దీంతో మహిళ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి మరుసటి రోజే ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసి చోరీకి గురైన బంగారు నగలు స్వాధీనం చేసుకున్నారు. ఈ సంఘటనపై అప్రమత్తమైన పోలీసులు తనిఖీల నిర్వహించారు. అనుమానాస్పదంగా వున్న వారిని విచారించారు. సిఐ మాట్లాడుతూ ప్రయాణీకులు బస్సు ఎక్కేటపుడు, దిగేటపుడు తమ బంగారు వెండి నగలు జాగ్రత్తగా ఉంచుకోవాలన్నారు. ఎవరైనా అనుమానాస్పదంగా వెంబడిస్తే వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయాలన్నారు. బస్టాండుతో సిసి కెమెరాలు లేకపోవడం వల్ల చోరీలకు తగిన ఆధారాలు దొరకడంలేదని ఈ విషయంపై ఆర్టీసీ అధికారులతో చర్చించి త్వరలో సిసి కెమెరాలు ఏర్పాటు చేస్తామని తెలిపారు.

మహిళ అదృశ్యం

పలమనేరు, అక్టోబర్ 6, ప్రభాతవార్త: బైరెడ్డిపల్లె మండలం చప్పిడిపల్లెకు చెందిన కన్నమ్మ రెండు రోజుల క్రితం అదృశ్యమైంది. పొలాలకు వెళ్ళి వస్తానని ఇంటి నుండి బయలు దేరిన ఈమె తిరిగి రాక పోవడంతో కుటుంబ సభ్యులు సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. చుట్టుపక్కల ప్రాంతాలు, తెలిసిన వారి ఇళ్ళు, పొలాలు వైపు వెతినా ఫలితంలేక పోవడంతో పోలీసులను ఆశ్రయించారు. ఇంట్లో ఏదైనా గొడవలు ఉన్నాయా తనంత తానుగా ఇల్లు వదలి వెళ్ళి పోయిందా అన్న కోణంలో పోలీసులు కుటుంబ సభ్యులను విచారిస్తున్నారు. ఈమె ఆచూకీ లభించిన వారు సెల్ నెంబర్

కోలా విశాలాక్షిని సత్కరించిన యువత

శ్రీకాళహస్తి,అక్టోబర్ 6 ప్రభాతవార్త శ్రీకాళహస్తీశ్వరాలయం ధర్మకర్తల మండలి కూర్పులో రాష్ట్ర బిజెపి ఉపాధ్యక్షుడు కోలా ఆనంద్ సతీమణి కోలా విశాలాక్షికి అవకాశం లభించటం కాపు సామాజిక వర్గానికి కూటమి ప్రభుత్వం ఇచ్చిన గుర్తింపు అని జనసేన నియోజకవర్గ నాయకులు అభివర్ణించారు. సోమవారం యువకులు కోలా ఆనంద్ ఇంటిలో ఆమెను సత్కరించారు. ఆమెతో పాటు కోలా ఆనంద్‌ను అభినందించారు. సత్కరించిన వారిలో నియోజకవర్గం అధ్యక్షులు దుమ్మూరాయల్, శ్రీకాళహస్తి పట్టణ అధ్యక్షుడు జాజాల ముని,ప్రధాన కార్యదర్శి అనిల్, నరేంద్ర, చిలక మురళి, సిద్దులుగా ప్రసాద్ తదితర నాయకులు హాజరయ్యారు.

నాటి మధుర జ్ఞాపకాలు మరువరానివి!

తొట్టంబేడు,అక్టోబర్ 6 ప్రభాతవార్త తొట్టంబేడు మండలం పెద్ద కన్నలి గ్రామంలో సోమవారం పూర్వ విద్యార్థుల అపూర్వసమ్మేళనం జరిగింది. పాఠశాలలో 2003-2004లో పదవ తరగతి పూర్తిచేసుకున్న విద్యార్థులు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వారు పాత జ్ఞాపకాలను గుర్తు చేసు కుంటూ ఇక్కడ అక్షరాలు నేర్చుకున్న తాము ఎంతో ఉన్నత స్థాయికి ఎదిగామన్నారు. ఆ నాటి జ్ఞాపకాలు నేటికి మరువకున్నామన్నారు. నాడు అక్షరమే అయుధంగా ఉండేదన్నారు. కానీ నేడు బట్టి పట్టే చదువులతో ఇక్కడ నేర్చుకున్న చదువు ఇక్కడే మరిచిపోతున్నారన్నారు. ఈ సందర్భంగా నాడు అక్షరా లు దిద్దించిన ఉపాధ్యాయులు. శోభారాణి, సరస్వతి, జయంతి, హేమామాలిని, శంకరయ్య, జనార్ధన్, శోభా రాని, పంశురాం, మునిరత్నం, రాధా, మునిలక్ష్మీలను సహాచరులు సత్కరించారు. అందరూ కలసి భోజనాలు చేసారు.

నిత్యాన్న ప్రసాదానికి విరాళం

శ్రీకాళహస్తి,అక్టోబర్ 6 ప్రభాతవార్త శ్రీకాళహస్తీశ్వరాలయంలో నిర్వహిస్తున్న నిత్యాన్న ప్రసాదానికి భక్తుల నుంచి భూరి విరాళాలు అందుతున్నాయి. సోమవారం స్వామి అమ్మవార్లను దర్శించుకున్న హైదరాబాదు వాసులు విఎస్‌కె రాజు కుటుంబసభ్యులతో భోజనం చేసారు. దాంతో స్పందిస్తూ రూ.70వేలు విరాళాన్ని ఆలయ ఎఇఒ మోహన్ ద్వారా దేవస్థానం అకౌంటెంట్‌కు అందజేసారు. వారికి ఆలయంలో వేదపండితులచే ప్రత్యేక దర్శనాలతో పాటు తీర్థ ప్రసాదాలు అందించారు.

అవుల దొంగలున్నారు! జాగ్రత్త!!

శ్రీకాళహస్తి,అక్టోబర్ 6 ప్రభాతవార్త శ్రీకాళహస్తి పట్టణంలో ఓ వైపు మోటార్‌సైకిళ్ళ దొంగలు,మరో వైపు బంగారు లాక్కెళుతున్న బ్యాచ్‌లు ఎంతో గోప్యంగా తమ పని చేసుకుంటూ పోతున్నారు. ఈనేపథ్యంలో రెండు రోజులుగా ఆవుల దొంగతనాలు చోటు చేసుకుంటున్నాయి. పట్టణంలోని ఆగ్రహారం ప్రాంతంలోని మటన్ షాపు నిర్వహించుకునే మహాబూబ్‌బాషా అనే వ్యాపారి జెర్సి ఆవుతో పాడి పరిశ్రమను నిర్వహించుకుంటున్నారు. ఆయన రూ.70వేలు విలువ చేసే ఆవును తొలుకొని వెళ్ళారు. అయితే బాధితులు చుట్టుపక్కల గ్రామాల్లో, మేత స్థలాల్లో వెదికి చివరకు ఒకటవ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసారు. ఇక్కడ పోలీసు అధికారులు రాష్ట్ర నాయకుల పర్యటనే బందోబస్తుకు వెళ్ళాటంతో ఎఎస్ఐయే దిక్కుగా మారారు. పుణ్యక్షేత్రంలో పోలీసుల అవసరాన్ని జిల్లా అధికారులు గుర్తించాల్సి ఉంది. అయితే ఈ ముఠా దొంగలు పగలుఇళ్ళవద్దగుర్తిస్తూరాత్రివేళ ప్రత్యేక వాహనం తీసుకొచ్చి దొంగతనాలకు పాల్పడుతున్నారని తెలిసింది.

పరశురామేశ్వరుని సేవలో జాయింట్ కలెక్టర్

శ్రీకాళహస్తి రూరల్,అక్టోబర్ 6 ప్రభాతవార్త ఏర్పేడు మండలంలోని గుడిమల్లంలో వెలసిన అనందవల్లి సమేత పరశురామేశ్వరుని సేవలో గుంటూరు సబ్‌కలెక్టర్‌రాఘవేంద్రమీనాకుటుంబసభ్యులతో కలసి దర్శించు కున్నారు. సోమవారం శివాలయంలో పూజలకు ఎంతో ప్రాధాన్యత ఉంది. ఈ నేపథ్యంలో సోమవారం ఆలయం వద్ద ధర్మకర్తల మండలి చైర్మెన్ బత్తలగిరినాయుడు, ఆలయఇఒ రామచంద్రారెడ్డి లుస్వాగతంపలికారు. అమ్మవార్లను దర్శించుకున్న వారికి వేదపండితులతో ప్రత్యేక ఆశీర్వచనాలు అందించారు.

దాడి కేసులో ఇద్దరు అరెస్టు

సత్యవేడు, అక్టోబరు 6 ప్రభాతవార్త: సత్యవేడు సర్కిల్ పరిధిలోని జరిగిన ఓ సంఘటన ఘర్షణల వరకు తీసుకుపోయినట్లు సీఐ మురళీనాయుడు పేర్కొన్నారు. సీఐ కథనం మేరకు... వరదయ్యపాళెం మండలం చిన్నపాండూరు కాయకూరల సంతలో నెల క్రితం కంచరపాల్యానికి చెందిన ప్రవీణ్ కుటుంబ సభ్యులకు రవి కుటుంబ సభ్యులకు మధ్య జరిగిన చిన్నపాటి ఘర్షణ జరిగింది. ఈ ఘర్షణను దృష్టిలో ఉంచుకున్న రవి పథకం ప్రకారం ప్రవీణ్ కొరకు కాపు కాశారు. ఇటీవల సత్యవేడు దళితవాడకు అత్తవారింటికి వచ్చిన ప్రవీణ్‌ను అదును చూసి రవి, తన తమ్ముడు పవన్, పెద్దమ్మ కుమారుడు పృథ్వీరాజ్‌తో కలసి విచక్షణా రహితంగా మూకుమ్మడిగా దాడి చేశారు. ఈ ఘటనలో ప్రవీణ్‌కు తీవ్ర గాయాలతో రక్తస్రావమైంది. ఇందుకు సంబంధించి బాధితుని ఫిర్యాదు మేరకు సత్యవేడు పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. పరారీలో ఉన్న నిందితులను ఆదివారం రాత్రి సీఐ ఆదేశాలతో ఎస్ఐ రామస్వామి, రవి, పవన్‌లను సత్యవేడు ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో అరెస్టు చేశారు. నిందితులను సత్యవేడులోని జ్యుడీషరీ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ ముందు ప్రవేశపెట్టి సత్యవేడు సబ్ జైలుకు రిమాండ్‌కు తరలించారు. ఈ సందర్భంగా సీఐ మురళీనాయుడు హెచ్చరిస్తూ సత్యవేడు సర్కిల్ పరిధిలో చట్ట విరుద్ధమైన ఏ కార్యకలాపాన్ని సహించేది లేదన్నారు. కాయకూరల సంతల వద్ద ఎలాంటి సంఘ విద్రోహక కార్యకలాపాలకు పాల్పడితే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ రామస్వామి, ఏఎస్ఐ చంద్రశేఖర్‌నాయుడు, ఈశ్వర్‌రెడ్డి, కోర్టు కానిస్టేబుల్ విజయ్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

జీఎస్టీ తగ్గింపులు వినియోగించుకోండి

పాకాల, అక్టోబర్ 6, ప్రభాతవార్త కంద్ర ప్రభుత్వం చేసిన జీఎస్టీ తగ్గింపులను అందరూ వినియోగించుకోవాలని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రధాన ఆచార్యులు డాక్టర్ ఎస్.వి రమేష్ కుమార్ అన్నారు. కళాశాల విద్య డైరెక్టర్ ఆదేశాల మేరకు సోమవారం కళాశాలలో జీఎస్టీ పై అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. కామర్స్ అధ్యాపకులు డాక్టర్ వి మాశిలామణి మాట్లాడుతూ జిఎస్టి 12 శాతం ఉన్న చాలా వస్తువులు జిఎస్టి 5 శాతం మార్పు చేశారని వీటిని అందరూ తెలుసుకోవాలన్నారు. నోటు పుస్తకాలు, పెన్నలు, పెన్సిల్లు, ఎరేజర్ల పై ఎటువంటి జిఎస్టి లేదన్నారు. అధ్యాపకులు చిట్టి కళావతి, మోహన్, బెహరా, ఆదిశేఖర్ రెడ్డి, ఈశ్వర్ బాబు, రమణమ్మ విద్యార్థులు పాల్గొన్నారు.

పోషకాహారంపై అవగాహన

పిచ్చాటూరు, అక్టోబర్ 6, ప్రభాతవార్త పిచ్చాటూరు ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిధిలోని పిచ్చాటూరు మండలం నందు సిడిపిఓ టిపి. సౌభాగ్యమ్మ ఆదేశాల మేరకు పోషణ్ మా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి సిడిపిఓ సౌభాగ్యమ్మ మాట్లాడు తూ పోషక ఆహారం తీసుకోవడం వల్ల వచ్చే లాభాలను, పోషకాహారం తీసుకోక పోవడం వల్ల వచ్చే నష్టాలను తెలియచేశారు. ఆడవాళ్లు రుతుక్రమ సమయంలో తీసుకోవలసిన జాగ్రత్తలు తెలియ చేసారు. బాల్య వివాహాలు జరగకుండా చూడాలని దీని వలన వచ్చే నష్టాలను తెలియ చేసారు. టీనేజ్ ప్రెగ్నేన్సీ వల్ల వచ్చే నష్టాలను తెలియ చేసారు. జింక్ పుడ్స్ తినడం వల్ల వచ్చిన నష్టాలను తెలియ చేసారు. రంగులు వేసిన పువ్వులు పెట్టుకోవడం వల్ల క్యాన్సర్ వచ్చే అవకాశం ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో బజావతి, సుమతి, రాజేశ్వరి, కల్పలత, శ్రీ దేవి, బేబి, సూపర్ వైజర్స్, మండలంలోని 49 మంది అంగన్వాడీ టీచర్స్, గర్భవతులు, బాలింతలు, తల్లులు పాల్గొన్నారు.

వాటర్ ప్లాంట్ కరెంట్ బిల్లు క్యాటగిరి3కి మార్చండి

తిరుపతి కలెక్టరేట్, అక్టోబర్ 6 ప్రభాతవార్త :

తిరుపతి, చిత్తూరు ఉమ్మడి జిల్లాలలోని వాటర్ ప్లాంట్ల కరెంట్ బిల్లులు కేటగిరి 2 లో ఉండడం వల్ల కరెంట్ బిల్లు అధికంగా వస్తుందని, క్యాటగిరి3కి మార్చాలని తిరుపతి వాటర్ ప్లాంట్ అసోసియేషన్ తిరుపతి, చిత్తూరు ఉమ్మడి జిల్లాల అధ్యక్షుడు ఎం మోహన్ బాబు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు సోమవారం ఏపీఎస్పీడీసీఎల్ సిఎండిని అసోసియేషన్ నేతలు, సభ్యులతో కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. మోహన్ బాబు మాట్లాడుతూ వాటర్ ప్లాంట్ ద్వారా జిల్లా ప్రజలకు తమ వంతు మంచి ప్రమాణాలతో కూడిన స్వచ్ఛమైన తాగునీటిని ప్రతి ఇంటికి ఆటోలు ద్వారా డ్రైవర్లు పెట్టుకుని ప్రతి నెల వారికి జీతాలు ఇస్తూ, ఆ భారాన్ని కూడా మేమే మోస్తూ సరఫరా చేస్తున్న విషయాన్ని గుర్తు చేశారు..20 లీటర్ల మంచినీటిని కేవలం 10 రూపాయలకే ఇస్తున్నామని, ఎక్కడ వాటర్ ప్లాంట్లలో రిటైల్ వ్యాపారం చేయడం లేదన్నారు. అయితే వాటర్ ప్లాంట్లకు కరెంట్ క్యాటగిరి 2 లో ఉన్నందున రెట్టింపు స్థాయిలో కరెంట్ బిల్లు వస్తుందని, ఆ బిల్లులను కట్టలేక ఇబ్బందికి గురి అవుతున్నామన్నారు. చిన్న పరిశ్రమగా నడుపుపడుతున్న వాటర్ ప్లాంట్లలో కరెంట్ బిల్లును క్యాటగిరి 2 నుండి 3 కి మార్చాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో తిరుపతి,చిత్తూరు ఉమ్మడి జిల్లాల అధ్యక్షుడు ఏం మోహన్ బాబుతో పాటు ఉపాధ్యక్షుడు రఘు, తిరుపతి అధ్యక్షుడు ఉదయ్ కుమార్ ఉపాధ్యక్షుడు శోభన్ బాబు ఈసీ నెంబర్ ప్రసాద్ ఉమ్మడి అనంతపురం జిల్లా అధ్యక్షుడు సి. రామ్మోహన్ ఉపాధ్యక్షుడు హరీష్ రాయల్ ఉపాధ్యక్షుడు జగన్ ఈసీ నెంబర్ విజయ్ కుమార్ .మురళి, తదితరులు పాల్గొన్నారు.

రైతుల కష్టాలు తీరేదెన్నటికీ..?

మామిడి సబ్సిడీ కొరకు నిరీక్షణ, వైసిపి నాయకుడు యారాశి చంద్రశేఖర్ రెడ్డి

చంద్రగిరి, అక్టోబర్ 6 ప్రభాతవార్త: రైతుల కష్టాలు తీరేదెన్నటికి అంటూ వైసిపి రైతు సంఘం నాయకుడు యారాశి చంద్రశేఖర్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. మామిడి రైతుల సమస్యలపై ఈ మేరకు మంగళవారం డిప్యూటీ తహశీల్దార్ దివాకర్‌కు ఆయన వినతి పత్రం అందజేశారు. చంద్రగిరిలో ఏర్పాటు చేసిన చర్చా వేధికలో ఆయన మాట్లాడుతూ ప్రతి సీజన్‌లోనూ కొండంత ఆశతో సాగు చేస్తున్న రైతులు ప్రభుత్వ నిర్లక్ష్యం, మార్కెట్ లోపాలు, ప్రాసెసింగ్ యూనిట్ల సమస్యలతో తీవ్రంగా నష్టపోతున్నట్లు తెలిపారు. మామిడి రైతులకు కూటమి ప్రభుత్వం చేసిన వాగ్దానాలను విస్మరించిందని విమర్శించారు. మామిడి రైతులు సబ్సిడీ కోసం నిరీక్షిస్తున్నట్లు తెలిపారు. గత సీజన్లో మామిడి రైతులకు రూ.8/-లు పల్స్ కంపెనీలు చెల్లించాలనీ, ప్రభుత్వం రూ.4/-లు చెల్లిస్తుందని చెప్పినా మళ్ళీ సీజన్ వస్తున్నా నేటికీ అమలుకు నోచుకోలేదన్నారు. ప్రభుత్వం వెంటనే మామిడి రైతుల సమస్యను పరిష్కరించని పక్షంలో పెద్దఎత్తున ఉద్యమిస్తామని ప్రభుత్వానికి హెచ్చరిక చేశారు. ఈ కార్యక్రమంలో మండల కోఅప్షన్ సభ్యుడు ఔరంగజేబు, మాజీ ఎంపిపి కుసుమకుమారి, వైసిపి ఆర్‌సి పురం మండల అధ్యక్షుడు ఎద్దల చంద్రశేఖర్ రెడ్డి, మాజీ సర్పంచ్ మురగయ్య, వైసిపి నాయకుడు ప్రకాష్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో రీ సర్వే

రామచంద్రాపురం, అక్టోబర్ 6 ప్రభాతవార్త: ప్రభుత్వం అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి రైతుల భూములను రీ జర్వే నిర్వహిస్తున్నట్లు టిడిపి చిత్తూరు పార్లమెంటరీ నియోజకవర్గ అధికార ప్రతినిధి చినబాబు అన్నారు. సోమవారం కమ్మపల్లిలో తహశీల్దార్ మధుసూదన్ రావు ఆధ్వర్యంలో రీ సర్వే గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 100 ఏళ్ళ క్రితం తయారు చేయబడిన రికార్డులు, కొలతల మేరకే ఇప్పటి వరకు భూముల హద్దులు వున్నట్లు తెలిపారు. కాలక్రమేణా రైతుల భూముల హద్దుల్లో జరిగిన మార్పులను ఆధునిక పద్ధతులలో రికార్డులను రూపొందించి భూమిపై కొతలు నిర్ధారించడం జరుగుతుందన్నారు. రైతులకు ఎటువంటి సమస్యలు వున్నా, అభ్యంతరాలు వున్నా తహశీల్దార్, రీ సర్వే డిప్యూటీ తహశీల్దార్ అమృత, విఆర్ఓ ప్రదీప్ నాయుడు దృష్టికి తీసుకువచ్చి సమస్యలను పరిష్కరించుకోవాలని సూచించారుటిడిపి నాయకుడు నీలకంఠ చౌదరి, కమ్మపల్లి రైతులు పాల్గొన్నారు.

సిఆర్‌యస్ చీఫ్ మేనేజర్‌గా శ్రీనివాస్..

రేణిగుంట, అక్టోబర్ 6 ప్రభాతవార్త రేణిగుంట (తిరుపతి) సి ఆర్ యస్ చీఫ్ వర్క్ షాప్ మేనేజర్‌గా రెండవసారి సోమవారం శ్రీనివాస్ ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. గతంలో ఆయన వర్క్ షాప్ మేనేజర్ గా విధులు నిర్వహించినప్పుడు వర్క్ షాప్ కు జాతీయస్థాయిలో మంచి పేరు తెచ్చారు. రెండోసారి ఆయన బాధ్యతలు చేపట్టడంతో ఉద్యోగులు, కార్మికులు, వివిధ కార్మిక సంఘాల నేతలు హర్షం వ్యక్తం చేశారు. కార్మిక సంఘాల నేతలు ఆయనకు శాలువలు కప్పి, ప్రసాదాలు అందజేసి ఘనంగా సత్కరించారు. ఆయనను సత్కరించిన వారిలో బ్రాంచ్ మజ్దూర్ యూనియన్ కార్యదర్శి సదాశివరెడ్డి, మజ్దూర్ యూనియన్ నేతలు హెంద్రీ పాల్, ముని రాధయ్య, గాండీవం, దిలీప్, నరేంద్ర కుమార్, ఈసీ మెంబర్లు, పలువురు కార్మిక నేతలు ఉన్నారు. నేతలు సి ఆర్ ఎస్ లోని అనేక సమస్యలపై శ్రీనివాస్ తో చర్చించగా పరిష్కరిస్తామని సానుకూలంగా స్పందించారు.

సాయి సేవ వృద్ధాశ్రమంలో అన్నదానం

శ్రీ సిటీ (తడ)అక్టోబర్ 6 ప్రభాతవార్త శ్రీ సిటీ (తడ)తడ మండలం మాంబట్టు గ్రామానికి చెందిన గ్రామీణ వైద్యులు పసుపులేటి నాగభూషణం చంద్రకళ దంపతుల 30వ వివాహ దినోత్సవం సందర్భంగా సూళ్లూరుపేట మన్నే ముత్తిరి సాయి సేవ వృద్ధాశ్రమంలో వృద్ధులకు అన్నదానం నిర్వహించారు ప్రతి ఏడాది నాగభూషణం చంద్రకళ వివాహ దినోత్సవం సందర్భంగా సాయి సేవా వృద్ధాశ్రమంలో ఆనవా యితీగా అన్నదానం నిర్వహిస్తూ వారి ఆశీస్సులు తీసుకుంటారు అదేవిధంగా వృద్ధాశ్రమం నిర్వహణకు మొదటి నుండి సహాయ సహకారాలు అందిస్తున్నారు వృద్ధాశ్రమం నిర్వాహకులు మస్తాన్ బాబు పసుపులేటి నాగభూషణం చంద్రకళ దంపతులను అభినందించారు

మాజీ ఎంఎల్‌ప చే అన్నదానం

శ్రీకాళహస్తి,అక్టోబర్ 6 ప్రభాతవార్త శ్రీకాళహస్తి మాజీ శాసనసభ్యుడు బియ్యపు మధుసూధనరెడ్డి పెళ్లిరోజు సందర్భంగా సోమవారం వాయులింగేశ్వరుని సన్నిధిలో అభిషేకాలు జరిపారు. పట్టణ పొలిమేరల్లోని అర్ధనారీశ్వరాలయంలో పూజలు జరిపారు. పలు చోట్ల అన్నదానం జరిపారు. ఈ సందర్భంగా మధుసూధనరెడ్డి దంపతులను ప్రత్యేకంగా ఆశీర్వదించారు. ఈ కార్యక్రమాల్లో మాజీ చైర్మెన్ అంజూరు తారక శ్రీనివాసుల, ఉమ్మడి చిత్తూరు జిల్లా ప్రదాన కార్యదర్శి ఉన్నం వాసుదేవనాయుడు, నియోజకవర్గంలోని కూనాటి రమణయ్యయాదవ్, పగడాల రాజు, కోవి చంద్రయ్యనాయుడు, ప్రభాకర్, మున్నారాయల్, ఉత్తరాజి శరవణ కుమార్, బుల్లెట్ జయశ్యాం, రామచంద్రారెడ్డి, కంఠాఉదయ్‌కుమార్, శ్రీవారి సురేష్, శివకుమార్, యాదవ్, పసల సురేష్, పులి రామచంద్రయ్య, మునికృష్ణారెడ్డి, మునిరెడ్డి, కోళూరు హరినాయుడు, లీలా, సెన్నిరు కుప్పం శేఖర్, పత్తిమణి, ఫజల్ మొగరాల గణేష్, ఆశకిరణ్, పెరుమాళ్ చౌదరి, ప్రసాద్, అప్పిని సుధాకర్ ముద్దుమూడి రవి, తూకివాకం ముని, బాబు, వెంకటేశ్వర్లునాయుడు, బావాజి, జై కృష్ణారెడ్డి, సతీష్, యూకూబ్, సురేష్ తదితరులు విడివిడిగా దంపతులను ఘనంగా సత్కరించారు.

గోసంరక్షణ పథకానికి విరాళం

శ్రీకాళహస్తి,అక్టోబర్ 6 ప్రభాతవార్త శ్రీకాళహస్తీశ్వరాలయంలో నిర్వహిస్తున్న నిత్యాన్న ప్రసాదానికి గుంటూరు వాస్తవ్యులు విరాళం అందించారు. సోమవారం స్వామి అమ్మవార్లను దర్శించుకున్న వారు ఎఇఒ మోహన్‌తో నిత్యాన్న ప్రసాదం వితరణ చక్కగా ఉందని భోజనం రుచికరంగా ఉందని తాము విరాళం ఇవ్వనున్నట్లు తెలిపారు. అలాగే గోశాల నిర్వహణను పరిశీలించి వారు సంతృప్తి చెందారు. గుంటూరుకు చెందినచవ్వాకులదినకర్‌దంపతులుగోశాలలోనిగోసంరక్షణ పథకానికి రూ.40వేలు విరాళం సమర్పించారు.

యస్వీలో బి.టెక్(సెల్ఫ్ ఫైనాన్స్) స్వీడన్ ప్రవేశాలకు స్పాట్ అడ్మిషన్లు.

తిరుపతి విద్య, అక్టోబర్ 6 ప్రభాతవార్త: శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం ఇంజనీరింగ్ కళాశాలలో బి.టెక్ (సెల్ఫ్ ఫైనాన్స్), కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్(స్వీడన్) లో అడ్మిషన్ల కొరకు ఈ ఎ పి సెట్ 2025 లో అర్హత పొందిన విద్యార్థులు స్పాట్ అడ్మిషన్ల ద్వారా పొందవచ్చని, పైన పేర్కొన్న కోర్సుల్లో చేరదలచిన విద్యార్థులు యస్వీయూలోని డైరెక్టరేట్ ఆఫ్ అడ్మిషన్స్ ద్వారా ప్రవేశాలు పొందవచ్చని యూనివర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య భూపతి నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. మరిన్ని వివరాలకు 08772248589 ఫోన్ నెంబర్ సంప్రదించాలని వారు తెలిపారు.

గోవిందుని సేవలో భూమన

తిరుమల,అక్టోబర్ 6ప్రభాతవార్తప్రతినిధి:

టిటిడి మాజీ ఛైర్మన్, వైసిపి ఉమ్మడిజిల్లా అధ్యక్షుడు భూమన కరుణాకర్‌రెడ్డి దంపతులు సోమవారం ఉదయం శ్రీవారిని దర్శించుకున్నారు. ఉదయం తిరుమలకు వచ్చిన ఆయన ఆలయంలోనికి చేరుకున్నారు. ఆలయ అధికారులు సాదరంగా స్వాగతించి స్వామివారి దర్శనం చేయించారు. తీర్థప్రసాదాలు అందజేశారు. కాగా చాలారోజుల తరువాత భూమన దంపతులు ఏడుకొండల వేంకటేశ్వరస్వామిని దర్శించుకోవడం విశేషం.

సర్వం శుభం కలగాలి

–వాహనాలకు ఆయుధాల పూజలో తుడ ఛైర్మన్ దివాకర్‌రెడ్డి

తిరుపతి,అక్టోబర్ 6 ప్రభాతవార్త:

దినదినాభివృద్ధిచెందుతున్న తుడకు చెందిన వాహనాలు సాఫీగా ప్రయాణించాలని, అన్ని విధాలా సురక్షిత రవాణా సాగాలని కోరుతూ తుడ ఛైర్మన్ సి.దివాకర్‌రెడ్డి, తుడ విసి శుభంబన్సల్ ఆకాంక్షించారు. సోమవారం సాయంత్రం తుడ వాహనాలకు ఘనంగా ఆయుధపూజ చేశారు. ముందుగా కార్యాలయం ఆవరణలో వాహనాలకు పూజలు చేసి శాస్త్రోక్తంగా వేదపండితులు వేదాశీర్వచనం అందుకున్నారు .అనంతరం ఉద్యోగులు, సిబ్బందికి స్వీట్లు పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో తుడ కార్యదర్శి శ్రీకాంత్, తుడ అదికారులు పాల్గొన్నారు.

IN THE COURT OF THE PRINCIPLE CIVIL JUDGE (SENIOR DIVISION) OF CHITTOOR
O.E.P.No: 20/2025
O.S.No: 281/2014

Between
C.Surendra Babu ...D.Hr/Plaintiff.
And
M.Lailamma ...J.Dr./Defendant.

Notice to the Judgment Debtor/Defendant

To
M.Lailamma
W/o late M.Chinna swamy Naidu,
Resident of D.No: 28-887/1,
Kannaiah Naidu colony,
Chittoor town, mandal & District.

Madam ,Please take notice that the above Execution Petition was filed against you for sale of your E.P. schedule property in recovery of the E.P. amount and the said matter is posted to 10-10-2025 for your appearance. Please be present on 10-10-2025 at 10- 30 A.M. before the said court either in person or through your advocate. Otherwise, the matter will be decided exparte.

V.Lokanadha Naidu.
Advocate for Decree Holder
Chittoor, 06-10-2025

ఓట్‌చోర్ గద్ది ఛోడ్: సంతకాల సేకరణ

శ్రీకాళహస్తి,అక్టోబర్ 6 ప్రభాతవార్త ఓట్‌చోర్ గద్దెఛోడ్ అంటూ కాంగ్రెస్ పార్టీ సంతకాల సేకరణ గావించారు. సోమవారం పార్టీ అధిష్టాన వర్గం ఆదేశాలతో నియోజకవర్గ సమన్వయకర్త తలపా దామోదర్‌రెడ్డి సంతకాల సేకరణ చేపట్టారు. అధికారం కోసం బిజెపి అడ్డదారులు తొక్కిందని ఎన్నికల కమిషన్ కేంద్ర ప్రభుత్వానికి తొత్తుగా మారిందన్నారు. పట్టణంలోని బృందావన్ కాలనీ నందు సంతకాల సేకరణ గావించారు. ఓటు హక్కును ప్రజలు సద్వినియోగం చేసుకోలేకపోతున్నారని ధ్వజమెత్తారు. ఈ కార్యక్రమాల్లో జిల్లా కిసాన్ కాంగ్రెస్ చైర్మెన్ జనార్ధన్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు జనార్ధన్‌రెడ్డి, సురేంద్రరెడ్డి, ఆంటోని, నవీన్, స్వామినాధన్, అరుణ్, విజయ్ పాల్గొన్నారు.

కెనరా బ్యాంక్ Canara Bank Together we can
గంగాధర నెల్లూరు శాఖ, చిత్తూరు జిల్లా, సెల్: 8333818516

బంగారు నగల వేలం ప్రకటన

ఇందుమూలముగా దిగువ తెలిపిన రుణగ్రహీతలకు తెలియజేయడమేమనగా మీరు మా బ్యాంకు వద్ద బంగారు నగలు తాకట్టు పెట్టి పొందిన రుణమును తిరిగి చెల్లించలేదు. పలుమార్లు నోటీసులు పంపినప్పటికీ ఐట్వాదా కాకుండా తిరిగి వచ్చినది. 13.10.2025 వ తేదీ లోపు బకాయిలు,ఇతర ఛార్జీలను చెల్లించి తనఖా పుంచిన సెక్యూరిటీలను తిరిగి పొందగలరు. లేనియెడల బ్యాంకు శాఖ ఆవరణంలో **తేది:14.10.2025 సా.4.00గం॥లకు లేదా బ్యాంకు నిర్ణయించిన ఏదేని తేదీలలో వేలం చేయుటకు** బ్యాంకు వారికి అధికారం కలదు.

క్ర. నెం.	ఖాతానెం.	రుణగ్రహీత పేరు & చిరునామా	బంగారు బరువు (గ్రాములలో)	బకాయి మొత్తం ఛార్జీలతో రూ.
1	180328130014	వి.సుజాత, భర్త షణ్ముగం, 1 అగ్రహారం	37.00	111,561.94
2	180346134236	హెచ్/డబ్ల్యూ, కొత్త వెంకటాపురం పోస్ట్, జి.డి. నెల్లూరు, చిత్తూరు జిల్లా.	16.00	72616.83

జి.డి.నెల్లూరు, తేది:06.10.2025 సం॥ బ్రాంచ్ మేనేజర్, కెనరా బ్యాంకు

తిరుపతి డివిజన్

తాగునీటిలో డ్రైనేజ్ నీరు కలుషితం

- దుర్గసముద్రంలో ప్రజా సమస్యలను గాలికి వదిలేసారు
- గ్రామసభలో గళం విప్పిన వార్డుసభ్యుడు, స్థానికులు

తిరుపతిరూరల్, అక్టోబర్ 6 ప్రభాతవార్త: దుర్గసముద్రం గ్రామ పంచాయతీలో తాగునీటిలో డ్రైనజ్ నీరు కలిసి, కలుషితమైతున్నాయని, భవి ష్యత్ ప్రమాదకరమైన ధమోరియా వచ్చే ప్రమాదం ఉందని స్థానికుడు ఆదెం శంకరానందరెడ్డి ఆవేదన వ్యక్తం చేసారు. తిరుపతిరూరల్ దుర్గసముద్రం గ్రామ పంచాయతీలో సోమవారం గ్రామసభ జరిగింది. ఓ ప్రవేట్ కళాశాలలో 2వేల మంది విద్యార్థులు ఉన్నారని, వారి మలమూత్రాలకు సంబంధించిన డ్రైనేజ్ పైప్‌లైన్ స్వర్ణముఖిలోకి వదిలేసారన్నారు. డ్రైనేజ్ వదిలే ప్రాంతంలోనే దుర్గసముద్రం గ్రామానికి నీరు అందించే రెండు మంచినీటి బోర్లు ఉన్నాయని, డ్రైనేజ్ నీళ్ళు బోరులోకి వెళ్లి తాగేనీరు కలుషితమైతున్నాయని వాపోయారు. అలాగే దుర్గసముద్రం గ్రామ పంచాయతీలో ఇసుక మాఫియా, మట్టి మాఫియాలు చెలరెగపోతున్నాయని, రాత్రిపగలు అనే తేడా లేకుండా అక్రమ వ్యాపారం మూడుపువ్వులు ఆరు కాయలుగా కొనసాగుతున్నా ఏ అధికారి అడ్డుకునే సాహసం చేయలేదన్నారు. పంచాయతీలో పారిశుధ్యం అధ్వన్నంగా ఉందని, వీధి దీపాలు వెలగలేదని పలువురు గ్రామస్తులు ఫిర్యాదు చేసారు. లైన్‌మెన్ సక్రమంగా విధులు నిర్వర్తించడం లేదని ఫిర

దేవుడు భూమి వేలం వేస్తే ఏలా! : నేదురుమల్లి

వాకాడు, అక్టోబర్ 6 ప్రభాతవార్త : వాకాడులో నాగేశ్వర స్వామి, అలాగానంద స్వామి, కోదండరాం స్వామివార్ల భూమిని సోమవారం వేలంపాట వేస్తామని తెలుపుతున్నారని నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి అన్నారు. మాకు తెలిసి రికార్డులు ప్రకారం 90 ఎకరాలపైన దేవుడు భూమి ఉంది అని చెప్పారు. గత ప్రభుత్వంలో నికరంగా దేవుడు భూమి ఎంత ఉంది తెలుసుకోవాలి అనే ఉద్దేశంతో సర్వే చేయించి రికార్డులోకి ఎక్కించి ఆ భూమిని వేలం పాట వేయించి పాడుకున్న ప్రజలు ఫీజు రూపంలో దేవాలయానికి ఇస్తారని ఇచ్చిన ఫీజుతో దేవాలయాల అభివృద్ధికి ఉపయోగపడతాయని ఉద్దేశంతో ఇలా చేశామని చెప్పారు. కానీ ఈ కూటమి ప్రభుత్వం మరొకసారి దేవుడు భూమి వేలం వేసి ఆదాయం పెంచాలను కుంటున్నారు. మంచిదే వేలం వేయడానికి వచ్చిన అధికారులు వాకాడులో మీ ఇష్టం వచ్చినట్టు దేవుడు భూమి వేలం వేస్తే ఒప్పుకునేదే లేదు అని రామ్‌కుమార్‌రెడ్డి అధికారులను హెచ్చరించారు. దేవుడు భూమి 90 ఎకరాలు ఉంటే నోటీసులో ఇచ్చినది 24 ఎకరాలు మాత్రమే ఎందుకు ఇలా ఇచ్చారు. కారణం ఏమైనా ఉందా అని ప్రశ్నించారు. ఏమైనా ఇబ్బందులు ఉంటే స్థానిక ప్రజలకు తెలియజేయాలని చెప్పారు. మరొకసారి అధికారులు వాకాడులో ఉన్న దేవాలయ భూమిని సర్వే చేసిన తర్వాత పద్ధతి ప్రకారం వేలం వెయ్యాలని చెప్పారు.

గూడూరు డివిజన్

రెడ్‌క్రాస్ కార్యవర్గ సభ్యునిగా సుబ్రహ్మణ్యంరెడ్డి

సూళ్లూరుపేట, అక్టోబర్ 6 ప్రభాతవార్త: తిరుపతి జిల్లా ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ నూతన కార్యవర్గాన్ని సోమవారం ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా సూళ్లూరుపేటకు చెందిన దువ్వూరు సుబ్రహ్మణ్యంరెడ్డిని జిల్లా కార్యవర్గ సభ్యునిగా ఎన్నుకున్నారు. నూతనంగా ఎన్నికైన ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ కార్యవర్గాన్ని జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్ అభినందించారు.

ఆరోగ్యం పట్ల అందరూ శ్రద్ధ చూపాలి

బాలాయపల్లి, అక్టోబర్ 6 ప్రభాతవార్త: నారాయణ ఆస్పత్రిలో పలు వ్యాధులకు అత్యాధునిక వైద్యం అందిస్తున్నట్లు వైద్యాధికారిణి డాక్టర్ కె.కృష్ణప్రియ తెలిపారు. బాలాయపల్లి మండలం మన్నూరు, జయంపు గ్రామాలలో నారాయణ మెడికల్ కాలేజీ, హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం జరిగింది. ఈ శిబిరంలో డాక్టర్లు కె.కృష్ణ ప్రియ, సింహాద్రిలు రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. రోగులకు బిపి, షుగర్, ఇంకా పలు రకాల వైద్య పరీక్షలు నిర్వహించారు. చుట్టు ప్రక్కల గ్రామాలనుంచి వచ్చి మహిళలు, వృద్ధులు వైద్య పరీక్షలు చేయించుకున్నారు. నారాయణ మాతృ సేవ పథకం ద్వారా ఉచితంగా కాన్పులు చేస్తున్నట్లు డాక్టర్ సింహాద్రి వివరించారు. బిడ్డకు 12 సంవత్సరాలు వచ్చే వరకు అన్ని రకాల టీకాలు, వైద్య సలహాలు ఉచితంగా ఇస్తున్నట్లు తెలిపారు. ఆసుపత్రికి వచ్చేటప్పుడు ఆధార్, ఆరోగ్యశ్రీ కార్డులు, మొబైల్ ఫోన్ తీసుకురావాలని సూచించారు. ఈ శిబిరంలో వైద్య సిబ్బంది, మండల వైసీపీ ఎగ్జిక్యూటివ్ మెంబర్ కాటూరి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులను ఆదుకునేందుకు ముందుకు రావాలి

వెంకటగిరి, అక్టోబర్ 6 ప్రభాతవార్త: పేద విద్యార్థులను ఆదుకునేందుకు దాతలు ముందుకు రావాలని మున్సిపల్ వైస్ చైర్మన్ ఎస్ బాలయ్య తెలిపారు. ముత్తూట్ మినీ ఫైనాన్స్ సమస్త వారు రాణిపేటలోని ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు బ్యాగులు, బుక్స్, గొడుగులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద విద్యార్థులను అందరూ ఆదుకోవాలని తెలిపారు. పాఠశాల అభివృద్ధి కూడా దోహద పడాలని తెలిపారు. కార్పొరేట్ సామాజిక బాధ్యత కార్యక్రమాల ద్వారా సమాజానికి ప్రయోజనం కలిగే బాధ్యతాయుతమైన సేవా కార్యక్రమాలను ముత్తూట్ మినీ ఫినాన్సియర్స్ సంస్థ చేపడుతుందని సంస్థ స్టేట్ హెడ్ కన్నబాబు అన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు కె.భారతీ అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ముత్తూట్ మినీ ఫినాన్సియర్స్ ఆంధ్రప్రదేశ్ స్టేట్ హెడ్ కే.కన్నబాబు, అనంతపురం జోనల్ మేనేజర్ రాజేష్ వేల్పూరి, వెంకటగిరి మండల విద్యాశాఖ అధికారి కొండయ్య నాయుడు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. అనంతరం 100 మంది విద్యార్థులకు స్కూల్ బ్యాగ్‌లు, నోట్ పుస్తకాలు, తల్లిదండ్రులకు గొడుగులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎంసి చైర్మన్ లక్ష్మి ప్రసన్న, చెవిరెడ్డిపల్లి మాజీ సర్పంచ్ సుబ్బారాయుడు, ప్రధానోపా ధ్యాయులు కే.భారతీ, ఉపాధ్యాయులు కోడూరు సుబ్రమణ్యం, వేణుమ్మ,ముత్తూట్ మినీ అనంతపురం ఆర్.ఎం అడ్మిన్ మధు, మార్కెటింగ్ మేనేజర్ లోకవంశీ, మేనేజర్లు తోట మునికుమార్ రెడ్డి,ఉడతా శశిధర్, టి.అనీల్ కుమార్, పి.రత్నకుమార్, తలారి శశికుమార్, సిబ్బంది కొక్కు జ్యోతి రెడ్డి, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

శ్రీనాగేశ్వరస్వామికి లక్ష బిల్వార్చన

సూళ్లూరుపేట, అక్టోబర్ 6 ప్రభాతవార్త: శ్రీ నాగేశ్వరస్వామి దేవస్థానంలో స్వామివారికి లక్ష బిల్వార్చన పూజను భక్తిశ్రద్ధలతో సోమవారం నిర్వహించారు. వేదపండితుల మంత్రోచ్చరణల మధ్య ఉదయం స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు చేసిన అనంతరం లక్ష బిల్వార్చన పూజకు శ్రీకారం చుట్టారు. ఓలేటి బాల సత్యనారాయణ, నాగలక్ష్మి కుమారి దంపతులు ఉభయకర్తలుగా వ్యవహరించారు. దేవస్థానం చైర్మన్ తాటిపర్తి ఆదినారాయణరెడ్డి, ప్రధాన అర్చకులు పేటేటి సునీల్‌కుమార్ శర్మ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాలు జరిగాయి.

నేడు పేర్నాటి శ్యాంప్రసాద్‌రెడ్డి రాక

కోట, అక్టోబర్ 6 ప్రభాతవార్త : వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సెంట్రల్ ఎగ్జిక్యూటివ్ సభ్యునిగా నియమించిన తర్వాత తొలిసారిగా మంగళవారం కోట మండలానికి పేర్నాటి శ్యాంప్రసాద్‌రెడ్డి వస్తున్నారు. ఆ మేరకు అభిమానులు, కార్యకర్తలు భారీ స్థాయిలో స్వాగత ఏర్పాట్లు చేస్తున్నారు. ఉదయం 9 గంటలకు విద్యానగర్‌లోని గాంధీబొమ్మ సెంటర్‌లో మహాత్మాగాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పిస్తారు. అనంతరం కోట క్రాస్‌రోడ్డులోని దివంగత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి నివాళి అర్పిస్తారు. అనంతరం భారీ ర్యాలీతో అల్లంపాడుకు బయలుదేరి వెళతారని రాష్ట్ర వైసీపీ పంచాయతీరాజ్ శాఖ ప్రధాన కార్యదర్శి పాదర్తి రాధాకృష్ణారెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమానికి మండలంలోని వైసీపీ శ్రేణులు, ఎంపిటిసిలు, సర్పంచులు, కార్యకర్తలు, అభిమానులు తరలిరావాలని ఆయన పిలుపునిచ్చారు.

గర్భవతులు పౌష్టికర ఆహారం తీసుకోవాలి : సిడిపివో

వెంకటగిరి, అక్టోబర్ 6 ప్రభాతవార్త: చిన్నారులు, గర్భవతులు పౌష్టికార ఆహారం తీసుకోవాలని సిడిపిఓ శంషాద్ బేగం తెలిపారు. వెంకటగిరి పట్టణం మందరీళ్ల వద్ద అంగన్వాడీ కేంద్రంలో సిడిపిఓ చిన్నారుల తల్లులకు పౌష్టికార ఆహారంపై అవగాహన కల్పించారు. గర్భం దాల్చిన సమయంలో బిడ్డ తల్లి క్షేమంగా ఉండాలంటే మంచి ఆహారం తీసుకోవాలని తెలిపారు. అంగన్వాడి కేంద్రాల్లో అన్ని వసతులు ఉన్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

జీఎస్టీ తగ్గింపుతో ఉపయోగకరం : కమిషనర్

వెంకటగిరి, అక్టోబర్ 6 ప్రభాతవార్త: కేంద్ర ప్రభుత్వం జీఎస్టీ తగ్గించడం వల్ల కొనుగోలు దారులకు ఎంతో మేలు జరుగుతుందని మున్సిపల్ కమిషనర్ వెంకట రామిరెడ్డి తెలిపారు. కమిషనర్ ఆధ్వర్యంలో సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. వెంకటగిరి మున్సిపల్ సిబ్బంది బ్యానర్లను చేతబట్టి పట్టణ పురవీధుల్లో బైక్ ర్యాలీ నిర్వహించారు. జీఎస్టీ 2.0 వలన అనేక వస్తువుల ధరలు తగ్గాయని బ్యానర్లు ద్వారా తెలియజేశారు. మున్సిపల్ కార్యాలయం నుండి రాజు వీధి తూర్పు వీధిలో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శానిటరీ ఇన్స్పెక్టర్ రామారావు, సిబ్బంది పాల్గొన్నారు.

అంతరాయం లేకుండా తాగునీటిని సరఫరా చేయండి

వెంకటగిరి, అక్టోబర్ 6 ప్రభాతవార్త: పట్టణ వాసులకు తాగునీటి సరఫరాలో అంతరాయం లేకుండా చేయాలని వైసిపి నియోజకవర్గ ఆర్టిఐ విభాగం అధ్యక్షులు, కౌన్సిలర్ ఆరి శంకరయ్య తెలిపారు. సమ్మర్ స్టోరేస్ ట్యాంకును అప్పటి మంత్రి నేదురుమల్లి రాజలక్ష్మి 70 కోట్ల రూపాయలతో మంజూరు చేయించి పట్టణ వాసులకు తాగునీటి సమస్య లేకుండా చేసినట్లు తెలిపారు. అయితే సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్ నుండి నీటిని సరఫరా చేసే పైపులు పాతవి అయినందువల్ల తరచూ పగిలిపోతూ తాగునీటి సరఫరాకు అంతరాయం జరుగుతున్నట్లు తెలిపారు. అమృత పథకం కింద కూడా రాంకుమార్‌రెడ్డి నిధులు మంజూరు చేయించారని చెప్పారు.

ఆర్‌టిసి డిపోకు స్వచ్ఛ్ ఆంధ్ర అవార్డు

వెంకటగిరి, అక్టోబర్ 6 ప్రభాతవార్త: వెంకటగిరి ఆర్టీసి డిపోకు స్వచ్ఛందర అవార్డును జిల్లా కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్ డిపో మేనేజర్ వెంకటకృష్ణ అందజేశారు. స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా డిపో పరిశుభ్రంగా ఉండడంతో ఈ అవార్డును అందించారు. ఈ కార్యక్రమంలో యాదవ సంఘం కార్పొరేషన్ చైర్మన్ నరసింహ యాదవ్, ఆర్టీసీ ఏఈ కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

వైకాపా నేత కొడవలూరుకు నేదురుమల్లి అభినందనలు

వాకాడు, అక్టోబర్ 6 ప్రభాతవార్త: వైకాపా రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ మెంబర్‌గా కొడవలూరు భక్తవత్సల రెడ్డి నియామకం పట్ల నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి శాలువా కప్పి అభినందనలు తెలిపారు. సోమవారం వాకాడులో నేదురుమల్లి నివాసంలో మండల వైకాపా మండల కన్వీనర్ సుధాకర్ నాయుడు ఆధ్వర్యంలో మండల వైకాపా నేతలు కలిసి ఆత్మీయ అభినందన సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో మండల పార్టీ కన్వీనర్ సుధాకర్ నాయుడు, ఉప సర్పంచ్ పాపారెడ్డి రాజశేఖర్‌రెడ్డి, సర్పంచ్ సిద్ధారెడ్డి మధుసూదన్‌రెడ్డి, మండల పరిషత్ ఉపాధ్యక్షుడు వాటంగారి వెంకట రమణయ్య, నాయకులు మాజీ ఎంపీపీ దువ్వూరు మధుసూదన్ రెడ్డి, మాజీ ఏఎంసీ డైరెక్టర్ జనార్దన్ రెడ్డి, నెల్లూరు పెంచల్ రెడ్డి, పెళ్లూరు కోటేశ్వర్ రెడ్డి, పాకం భాస్కర్ రెడ్డి, గూడూరు సుధాకర్ రెడ్డి, నేదురుమల్లి హిమ కుమార్ రెడ్డి, నల్లా రెడ్డి మధుసూదన్ రెడ్డి, దువ్వూరు రమణారెడ్డి, వాకాటి రవికుమార్, తదితరులు ఉన్నారు.

నేదురుమల్లితో ఎస్ఈసి సభ్యులు భేటీ

వాకాడు, అక్టోబర్ 6 ప్రభాతవార్త: వాకాడులోని నేదురుమల్లి నివాసంలో సోమవారం వైకాపా రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ మెంబర్ కుమార్‌స్వామి రెడ్డి మర్యాదపూర్వకంగా నేదురుమల్లి రామ్ కుమార్‌రెడ్డిని కలిశారు. రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ మెంబర్‌గా కుమార్‌స్వామిరెడ్డికి పార్టీ పదవి రావడంతో రామ్ కుమార్ రెడ్డి శాలువ కప్పి ఘనంగా సత్కరించారు. గతంలో పార్టీ కోసం పనిచేస్తున్న కుమార్ స్వామి రెడ్డి పై కూటమి ప్రభుత్వం అక్రమ కేసులు పెట్టిన విషయం తెలిసిందే. పార్టీ బలోపేతం చేయాలని కుమార్‌స్వామిరెడ్డికి రామ్ కుమార్‌రెడ్డి సూచించారు.

భూమి లేని నిరుపేదలకు భూములు ఇవ్వండి : సిపిఎం

గూడూరు, అక్టోబర్ 6 ప్రభాతవార్త: భూమి లేని నిరుపేదలకు భూములు ఇవ్వాలని సీపీఎం ప్రాంతీయ కార్యదర్శి జోగి శివకుమార్ పేర్కొన్నారు. సోమవారం స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద బాలయపల్లి మండలం గొట్టికాడు గ్రామస్థులతో కలిసి నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాలయపల్లి మండలం పరిధిలోని గొట్టిపాడు రెవెన్యూ సర్వే నెంబరు 1, 33, 36లలో ఉన్న పూర్తి విస్తీర్ణము 1559 ఎకరాల ప్రభుత్వ భూమి ఉందని పేర్కొన్నారు. అనంతరం సబ్ కలెక్టర్ రాఘవేంద్ర మీనాకి వినతి పత్రం అందచేశారు. ఈ కార్యక్రమంలో పామంజి మణి, కెవిపిఎస్ నాయకులు అడపాల ప్రసాద్, ఎంబేటి చంద్రయ్య, రాజాగోపాల్, వసంత్, ప్రభాకర్, తదితరులు పాల్గొన్నారు.

సిబ్బందితో సమావేశం నిర్వహించిన ఎంపీడీవో

వాకాడు, అక్టోబర్ 6 ప్రభాతవార్త: మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ని సోమవారం ఎంపీడీవో యం. సాయిప్రసాద్ ఆధ్వర్యంలో మండలంలోని 12 సచివాలయాలకు సంబంధించిన సిబ్బందితో సమీక్ష సమావేశం జరిగింది. ఎంపీడీవో సిబ్బందికి పలు సూచనలు చేయడం జరిగింది. రాష్ట్ర ప్రభుత్వం వారు జారీ చేసినటువంటి పి4 మరియు వర్క్ ఫ్రం హోం సర్వేల పై సమీక్ష నిర్వహించారు.

ఆట వస్తువులు అందజేసిన ఎస్ఐ

చిల్లకూరు, అక్టోబర్ 6 ప్రభాతవార్త: మండల పరిధిలోని పాలిచెర్లవారి వారి పాళెం ఉన్నత పాఠశాలకు చిల్లకూరు పోలీసు స్టేషన్ ఎస్ఐ సురేష్ బాబు ఆటవస్తువులు అందజేశారు. మెగా పిటిఎంకు హాజరైన సందర్భంగా విద్యార్థులకు ఆటవస్తువులు అందిస్తానని హామీ ఇచ్చారు. సోమవారం దాదాపుగా 25వేల రూపాయల విలువ చేసే బ్యాట్‌లు, బాల్‌లుతో పాటు వివిధ రకాల ఆటవస్తువులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు అనసూయ, ఉపాధ్యాయులు చంద్రశేఖర్, మాధవయ్య, శ్రీనివాసులు, ప్రజేంద్ర, సుగుణ, లావణ్య, రవీంద్ర సంధ్యా రాణి, లీల, మధుసూదనరావు నాగ భూషణమ్మ, విధ్యుల్లత, ఫిజికల్ డైరెక్టర్ కామేశ్వరి విద్యార్థులు పాల్గొన్నారు.

మజ్దూర్ సంఘ్ పదాధికారుల సమావేశం

గూడూరు, అక్టోబర్ 6 ప్రభాతవార్త: గుంటూరులో భారతీయ జనతా మజ్దూర్ సంఘ్ ప్రధాన కార్యాలయం నందు పదాధికారుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశం బిజేఎంఎస్ జాతీయ అధ్యక్షులు శాంత్ ప్రకాష్ జాటవ్ ఆదేశాల మేరకు జాతీయ కార్యదర్శి, ఆంధ్ర ప్రదేశ్, తెలంగాణ ఇన్చార్జ్ మద్దిశెట్టి శ్యామేలు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షులు నాలి మధుసూధన్, తెలంగాణా అధ్యక్షులు శ్రీనివాస్ గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సమావేశంలో బి.జె.ఎం.ఎస్ భవిష్యత్తు కార్యాచరణపై చర్చించడం జరిగింది. జిల్లా కార్యవర్గాల నియామకాలు చేయటం జరిగింది. ఏలూరు జిల్లా అధ్యక్షులుగా రంగు మాధవాచారి, ఎన్.టి.ఆర్ జిల్లా అధ్యక్షులుగా సాయి మణికంఠ, బాలాజీని నియమించి వారికి దిశా నిర్దేశం చేసారు.

ఈ నెల 8నుండి ఆధార్ ప్రత్యేక క్యాంపులు

గూడూరు, అక్టోబర్ 6 ప్రభాతవార్త: పట్టణంలో తపాలా శాఖ ద్వారా ఈ నెల 8 నుండి 14వ తేదీ వరకు ఆధార్ ప్రత్యేక క్యాంపులు నిర్వహిస్తున్నట్లు గూడూరు డివిజన్ పోస్టల్ సూపర్డెంట్ ఎల్‌వి మురళి కుమార్ పత్రిక ప్రకటనలో పేర్కొన్నారు. ఈనెల 9న జడ్పీ గర్ల్స్ హై స్కూల్, 10వ తేదీన సిఎస్ఎం హై స్కూల్, 13, 14వ తేదీల్లో విఎస్ఆర్ హై స్కూల్ నందు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

న్యాయవాదులు సహాయ నిరాకరణ

- కలెక్టర్ కార్యాలయం ఎదుట సిపిఐ ఆధ్వర్యంలో నిరసన

చిత్తూరుహెల్త్, అక్టోబర్ 6 ప్రభాతవార్త: మైనర్‌బాలికలు, మహిళలపై అత్యాచారాలకు పాల్పడే నిందితులకు బార్ అసోసియేషన్ నాయకులు ఎలాంటి సహాయం చేయకూడదని జిల్లా సిపిఐ కార్యదర్శి ఎస్.నాగరాజు అన్నారు. కలెక్టరేట్ ఎదుట సోమవారం సిపిఐ ఆధ్వర్యంలో కామాంధులకు వ్యతిరేకంగా నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సిపిఐ కార్యదర్శి నాగరాజు మాట్లాడుతూ ఐదు రోజుల క్రితం పెనుమూరు క్రాస్‌లోని అటవీశాఖ ప్రజల ఆహ్లాదం కోసం ఏర్పాటు చేసిన నందనవనంలో మైనర్ బాలికపై కన్నేసిన ముగ్గురు కామాందులు గ్యాంగ్‌రేప్‌కు పాల్పడ్డారని, ఈ కేసులోని నిందితులను చిత్తూరు జిల్లా బార్ అసోసియేషన్ న్యాయవాదులు మానవతా దృక్పథంతో ఆలోచించి వారికి ఎలాంటి సహకారం అందించరాదని కోరారు. అధికార, ప్రతిపక్ష పార్టీల్లో ఇలాంటి కామాంధులను చేర్చుకోవడం వల్లే మైనర్ బాలికలపై, వయస్సుతో నిమిత్తం లేకుండా మహిళలపై అత్యాచారాలు జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. అటవీశాఖ పార్కులో గస్తీని పెంచాలని, భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా పోలీసులు పక్కా చర్యలు తీసుకోవాలన్నారు. సిపిఐ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పవన్ కళ్యాణ్‌కు శివయ్య ప్రసాదాలు

శ్రీకాళహస్తి, అక్టోబర్ 6 ప్రభాతవార్త: జనసేన పార్టీ వ్యవస్థాపకులు రాష్ట్ర అధ్యక్షులు రాష్ట్ర ఉపముఖ్య మంత్రి పవన్ కళ్యాణ్‌కు సోమవారం శ్రీకాళహస్తీశ్వరుని తీర్థ ప్రసాదాలను అందించారు. జనసేన పార్టీ శ్రీకాళహస్తికి చెందిన ఉమ్మడి చిత్తూరుజిల్లా కార్యదర్శి కొట్టే సాయికి శ్రీకాళహస్తీశ్వరుని పాలకమండలి చైర్మెన్‌గా ప్రకటించారు. ఎవ్వరూ ఊహించని రీతిలో పార్టీ ఓ సామాన్య కార్యకర్తగా ఉన్న కొట్టే సాయికి అవకాశం కల్పించారు. ఈ నేపథ్యంలో సోమవారం కర్నాటకకు వచ్చిన పవన్ కళ్యాణ్‌కు బెంగుళూరు విమానాశ్రయంలో కలసి శివయ్య తీర్థ ప్రసాదాలను అందించారు. పారదర్శకతతో పరిపాలించండి పార్టీకి మంచిపేరు తీసుకురండి అలాగే భక్తుల సదుపాయాలకు పెద్దపీట వేయండని సలహాలు ఇచ్చినట్లు సమాచారం.ఆయనతో పాటు జనసేనకు చెందిన గొల్లపల్లికి చెందిన మునిబాబు ఉన్నారు.

టువీలర్‌ను ఢీకొన్న ఇన్నోవా కారు... యువకుడి పరిస్థితి విషమం

పెద్దపంజాణి, అక్టోబర్ 6 ప్రభాతవార్త : పలమనేరు - పుంగనూరు జాతీయ రహదారిలో సోమవారం సాయంత్రం ఓ ఇన్నోవా కారు టు వీలర్‌ను ఢీకొన్న సంఘటనలో యువకుడి పరిస్థితి విషమ ంగామారింది. స్థానికులు, పోలీసులుతెలిపిన మేరకు వివరాలిలా.. చౌడేపల్లి మండలం గుట్టకపల్లికి చెందిన జాఫర్ (19) టువీలర్‌లో పలమనేరు నుంచి తన స్వగ్రామానికి బయలుదేరాడు. మార్గమధ్యంలో మిట్టకోళ్లు ఫారం వద్ద రాయలపేటకు చెందిన హరీష్ అనే వ్యక్తి ఇన్నోవా క్రిస్టా కారులో బెంగళూరు వెళ్తూ టువీలర్‌ను ఢీకొన్నాడు. దీంతో జాఫర్‌కు తీవ్రగాయాలు కాగా స్థానికులు హుటాహుటిన అతన్ని పలమనేరు ఆస్పత్రికి తరలించారు.

విదేశీ వద్దు.. స్వదేశీ ముద్దు

- స్వదేశీ సంకల్పం.. అత్మనిర్భర భారత్ పథం - బిజేపి రాష్ట్ర అధికార ప్రతినిధి

తిరుపతి హెల్త్, అక్టోబర్ 6 ప్రభాతవార్త : విదేశీ వద్దు.. స్వదేశీ ముద్దు అని, స్వదేశీ సంకల్పం ఆత్మనిర్భర భారత్ పథం ఇదే నరేంద్ర మోడీ మంత్రం అని బిజేపి రాష్ట్ర అధికార ప్రతినిధి జల్లి మధుసూధన్ తెలిపారు. సోమవారం తిరుపతి ప్రెస్ క్లబ్‌లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోడీ ఐదేళ్ల క్రితం ఆర్థికంగా బలమైన, దృఢమైన, ప్రపంచ స్థాయిలో పోటీ పడగలిగే ఆత్మనిర్భర్ భారత్ కోసం పిలుపునిచ్చారన్నారు. ప్రపంచ సవాళ్లకు ప్రతిస్పందనగా మొదలైన ఈ ఆలోచన, నేడు జాతీయ ఉద్యమంగా మారి ప్రతి భారతీయుడిలో వోకల్ ఫార్ లోకల్ పట్ల విశ్వాసాన్ని కలిగించిందన్నారు. లోకల్ టూ గ్లోబల్ యాత్రకు ప్రేరణనిచ్చిందన్నారు. ఇది కేవలం నినాదం కాదని భారత ఆత్మగౌరవానికి, సుసంపన్నతకు మార్గదర్శక మంత్రం ఖాది నుండి బ్రహ్మోస్ వరకు దీపం నుండి డిజిటల్ యుపిఐ వరకు ప్రతి రంగంలో స్వదేశీ శక్తిని ప్రపంచం ముందుంచుతోందన్నారు. ప్రధాని దూరదృష్టి నాయకత్వంలో స్వదేశి సంకల్పాన్ని బలోపేతం చేస్తున్నాయన్నారు. మేక్ ఇన్ ఇండియా, మేక్ ఫార్ ది ఓరల్డ్ భావనతో భారత్ పరిశ్రమలలో, వ్యవసాయంలో, టెక్నాలజీలో కొత్త దిశగా దూసుకెళ్తోందన్నారు. కోవిడ్ పాండమిక్ సమయంలో భారతదేశం కోటాను కోట్ల టీకాలు, పిపిఈ కిట్లు తయారు చేసి వంద కన్నా ఎక్కువ దేశాలకు సహాయం చేసిందన్నారు. భారతీయ వస్తువులు కొనండి, భారతీయులను ఆదరించండి ప్రతి ఇల్లు, ప్రతి దుకాణం గర్వంగా 140 కోట్ల జనాభా ప్రతి ఇంటా స్వదేశీ, ఇంటి ఇంటా స్వదేశీ అనే ఉద్యమంలో ప్రతి ఒక్కరూ భాగస్థులవ్వాలని పిలుపునిచ్చారు.

శివయ్య సేవలో పెద్దిరెడ్డి పూజలు

శ్రీకాళహస్తి,అక్టోబర్ 6 ప్రభాతవార్త: శ్రీకాళహస్తీశ్వరుని సేవలో మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పూజలు జరిపించుకున్నారు. ఆయనకు వైకాపా శ్రేణులు ఘనస్వాగతం పలికారు.ఈ సందర్భంగా మాజీ మంత్రి ఆలయంలో నిర్వహించే రాహుకేతుదోష నివారణ పూజలు జరిపించుకోవాలని కోరారు. ఆలయాధికారులు సహస్రలింగేశ్వరాలయం ఎదురుగా ఏర్పాట్లు చేసారు. ప్రత్యేక రాహుకేతుదోష నివారణ పూజల టిక్కెట్లు కొనుగోలు చేసి వేదపండితులతో పూజలు జరిపించారు. తరువాత స్వామి అమ్మవార్ల అంతరాలయం దర్శనం ఏర్పాటు చేసారు.దర్శనానంతరం వారికి మృత్యుంజయస్వామి ఆలయం వద్ద వేదపండితులతో ప్రత్యేకాశీర్వచనాలు అందించారు.ఈ సందర్భంగా మాజీ శాసనసభ్యుడు బియ్యపు మధుసూధనరెడ్డి శ్రీకాళహస్తిలో ప్రసిద్ధి గాంచిన కలంకారి కండువాతో సత్కరించారు.ఈ సందర్భంగా వేదపండితులు ప్రత్యేక ఆశీర్వచనాలు అందించారు.స్వామి అమ్మవార్ల తీర్థ ప్రసాదాలను అందించారు. ఏర్పాట్లును మాజీ శాసనసభ్యుడు బియ్యపు మధుసూధనంరెడ్డితో పాటు మాజీ ధర్మకర్తల మండలి చైర్మెన్ అంజూరు తారక శ్రీనివాసులు, వైకాపా రాష్ట్ర సంయుక్త కార్యదర్శి షేక్ సిరాజ్‌బాషా, లోకేష్ యాదవ్, మున్నారాయల్, ఉత్తరాజి శరవణ కుమార్, బుల్లెట్ జయశ్యామ్, కంఠా ఉదయ్‌కుమార్, ఆర్కాటు ముత్తు, కంచి గురవయ్య, ముద్దమూడి రవి, చుక్కల కిరణ్,శివ,సూర్య,సతీష్, రాము, దినేష్, యాఖూబ్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

అర్థగిరిలో ఘనంగా పౌర్ణమి వేడుకలు

తవణంపల్లె, అక్టోబర్ 6 ప్రభాతవార్త: ప్రముఖ పుణ్యక్షేత్రమైన అరగొండ అర్థగిరి శ్రీవీరాంజనేయస్వామి దేవస్థానంలో సోమవారం పౌర్ణమి వేడుకలు ఘనంగా జరిగాయి. ప్రతి నెలా ఆలయంలో పౌర్ణమి వేడుకలు నిర్వహిస్తుంటారు. ఆలయ ఈఓ ఇ.మునిశేఖర్ ఆధ్వర్యంలో ఈవేడుకలను నిర్వహించారు. ఆలయంలో ప్రధాన అర్చకులు వేణుగోపాలాచార్యులు ఆధ్వర్యంలో ఉదయం స్వామి వారి మూలవిరాట్‌కు శాస్త్రోక్తంగా పంచామృతాభిషేకం, పూజలు నిర్వ